# ప్రజాపక్షం

PRAJAPAKSHAM

స్తంభాద్రి భద్రాద్రి

శనివారం | 01 | జూన్ | 2024

పేజీలు 8


# నట్టేట ముంచుతున్న నకిలీ విత్తనాలు..!

- ప్రతీ ఏటా భారీగా నష్టపోతున్న రైతన్నలు
- వేళ్లూనుకుంటున్న అక్రమ వ్యాపార సామ్రాజ్యం
- నామమాత్రంగా దాడులు
- గట్టి నిఘా పెడితేనే మేలు

2లో





# తాగు, సాగు నీటికి సత్వర పరిష్కారం

మంత్రి పొంగులేటి



2లో

# తెలంగాణ ప్రజల ఆకాంక్షల వేదిక

- రాష్ట్ర సాధనలో సిపిఐ కీలక భూమిక
- దశాబ్ది తెలంగాణ







తెలంగాణ ప్రజల గుండె చప్పుడు విని వారి ఆకాంక్షలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటూ ప్రజల పక్షాన నిలిచిన ఏకైక రాజకీయ పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) నాటి సాయుధ రైతాంగ పోరాటం నుంచి నిన్న మొన్నటి ఎన్నికల వరకు సిపిఐ తీసుకున్న నిర్ణయాలు చారిత్రత్మకం. ప్రతి నిర్ణయం తెలంగాణ ప్రజలు ఏమి ఆశిస్తున్నారో అందుకు అనుగుణంగానే జరిగింది. నిజాం రక్కసి పాలనలో ప్రజల స్థితి గతులను చూసి నిజాం పాలన అంతమైతే తప్ప ప్రజల ఇతి బాధలు పోవని జమీందారి, జాగీర్‌దారి దౌర్జన్యాలు అంతం కావని మహోత్తర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి పిలుపునిచ్చింది. నాలుగువేల మంది అమరుల రక్త తర్పణతో తెలంగాణ భారతదేశంలో విలీనమైంది. అమరుల త్యాగాలతో పూనితమైన ఈ నేల భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుతో ఆంధ్రప్రదేశ్‌లో అంతర్భాగమైంది. తెలంగాణ ప్రజల మనోభావాలను ఆసరాగా తీసుకుని రాజకీయంగా సొమ్ము చేసుకోవాలని ప్రయత్నాలు జరిగిన ప్రతిసారి సిపిఐ అడ్డుగా నిలిచింది. రాజకీయ స్వార్థ పరుల ఆలోచనలను తిరస్కరించాలని విజ్ఞప్తి చేసింది.

**వెనకబాటును గుర్తించిన సిపిఐ...**

ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ వెనకబాటును గుర్తించిన తొలి రాజకీయ పార్టీ సిపిఐ. సాగు నీటి ప్రాజెక్టులు, ఉద్యోగ, ఉపాధి కల్పన రంగాలు, రవాణా, తాగునీరు, విద్య, వైద్యం తదితర విషయాలపై అధ్యయనం చేసి తెలంగాణ ప్రాంతానికి ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని డిమాండ్ చేస్తూ అందుకు అనుగుణంగా ఆందోళనలు చేపట్టింది. 1990 దశకంలోనే దుమ్ముగూడెం నుంచి ప్రత్యేక యాత్ర చేపట్టి తెలంగాణ సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలని అప్పటి పాలకులను కోరుతూ సదస్సులు, సభలు, ఆందోళన కార్యక్రమాలను నిర్వహించింది. తెలంగాణ ప్రాంత వెనకబాటు తనాన్ని యావత్ దేశం దృష్టికి తీసుకు రావడమే కాకుండా ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ సాగునీటి ప్రాజెక్టుల పట్ల ఉమ్మడి రాష్ట్ర పాలకులు చూపించిన వివక్షను చట్టసభలలో నిలదీసింది. 2001 సంవత్సరంలో మలిదశ తెలంగాణ ఉద్యమం పురుడు పోసుకునే వరకు తెలంగాణ ప్రజల పక్షాన వారి సమస్యల పరిష్కారానికి కృషి చేసిన పార్టీ సిపిఐ మాత్రమే. తెలంగాణ ప్రజల ఆశలను, ఆకాంక్షలను , మనోభావాలను గుర్తించి అందుకు అనుగుణంగా కార్యక్రమాలను చేపడుతూ వచ్చింది.

**ప్రత్యేక రాష్ట్ర సాధనకు మద్దతు...**

తెలంగాణ ప్రాంతాన్ని ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ మలిదశ తెలంగాణ ఉద్యమం పురుడుపోసుకున్న తర్వాత తెలంగాణ ఉద్యమానికి మద్దతుగా నిలిచిన తొలి జాతీయ పార్టీ సిపిఐ. కేవలం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు మద్దతు ఇవ్వడమే కాకుండా తెలంగాణలో జరిగిన ప్రతి పోరాటానికి దన్నుగా నిలిచింది. తెలంగాణ సాధన కోసం ఒక ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకుని అందుకు అనుగుణంగా మిలిటెంట్ పోరాటాలను నిర్వహించింది. గ్రామస్థాయి నుంచి తెలంగాణరాష్ట్ర అవసరాన్ని ప్రజలకు వివరిస్తూ తెలంగాణ రాష్ట్ర సాధనోద్యమం కోసం తెలంగాణ ప్రజలను కార్యోన్ముఖ్ములను చేయడంలో సిపిఐ కీలక భూమిక పోషించింది. ముఖ్యంగా తెలంగాణ ఉద్యమం పతాక స్థాయికి చేరిన 2009 నుండి 2014 వరకు సిపిఐ పోషించిన పాత్ర అమోఘమైంది. అప్పట్లో నలుగురు శాసన సభ్యులు ఉన్న సిపిఐ శాసన సభలో అవకాశం దొరికిన ప్రతిసారి తెలంగాణ వాదాన్ని వినిపించారు. ఇక పాదయాత్రలు, రాస్తారోకోలు, రైల్‌రోకోలు, ప్రభుత్వ కార్యాలయాల ముట్టడి, అమరణ నిరాహార దీక్షలు సహా ఉద్యమాన్ని పతాక స్థాయికి తీసుకెళ్లింది. శాసన సభలో సిపిఐ పక్ష ఉప నాయకునిగా ఉన్న ఇప్పటి రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, అప్పటి జిల్లా పరిషత్ ఉపాధ్యక్షులు బోల్లోజు అయోధ్య నేతృత్వంలో మణుగూరు నుంచి అన్ని నియోజక వర్గాలను, మండలాలను తాకుతూ చేపట్టిన 420 కిలో మీటర్ల పాదయాత్ర రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఈ పాదయాత్ర ముగింపు సభకు అప్పటి సిపిఐ జాతీయ కార్యదర్శి ఏబి బర్దన్, రాష్ట్ర కార్యదర్శి నారాయణ హాజరయ్యారు. తెలంగాణ ఉద్యమకారులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అప్పటి జేఏసి పిలుపు మేరకు హైదరాబాద్‌లో జరిగిన అనేక పోరాటాలకు సిపిఐ నేతృత్వం వహించింది. సకల జనుల సమ్మెలో సిపిఐ పోషించిన పాత్ర ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాలకు దన్నుగా నిలిచిన తీరు తెలంగాణ వ్యతిరేకుల నుంచి సైతం ప్రశంసలు పొందింది. తెలంగాణ వ్యాప్తంగా వేలాది మంది సిపిఐ కార్యకర్తలపై అనేక కేసులు నమోదయ్యాయి. ముఖ్యంగా సిపిఐ అనుబంధ ఆర్టిసి కార్మికులు సకల జనుల సమ్మె సందర్భంగా వ్యవహరించిన తీరు, ఉద్యోగాలను సైతం ఫణంగా పెట్టి పోరాడిన పద్ధతి అందరి ప్రశంసలను పొందింది. రైల్‌రోకో సందర్భంగా ఒక ఖమ్మంలోనే వంద మంది సిపిఐ నాయకులు, కార్యకర్తలపై పెద్ద సంఖ్యలో కేసులు నమోదై అనేక రోజుల పాటు జైళ్లకు వెళ్లాల్సి వచ్చింది. కూనంనేని సాంబశివరావు చేపట్టిన అమరణ నిరాహార దీక్ష తెలంగాణ రాష్ట్రాన్ని స్పందింపజేసిందంటే అతిశయోక్తి కాదు. కోదండరాం, కేటిఆర్ తో పాటు సిపిఐ నేతలు పువ్వాడ నాగేశ్వరరావు, కె. నారాయణ తో పాటు రాష్ట్ర, జిల్లా నాయకులు ఆనాటి ఆందోళనలో పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సైతం ప్రభుత్వం ఒంటెద్దు పోకడలకు, నిర్బంధాలకు వ్యతిరేకంగా రాజకీయ పోరాటం చేస్తూ తెలంగాణ ప్రజల ఆకాంక్షలను గుర్తించి పాలన సాగించాలని పోరాడిన పార్టీ సిపిఐ. నీళ్లు, నిధులు, నియమాకాల కోసం ఏర్పడిన రాష్ట్రంలో దోర అహంకారం, అవినీతి, అశ్రీత పక్షపాతం చోటు చేసుకోవడాన్ని సిపిఐ తీవ్రంగా వ్యతిరేకించింది. తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు వ్యతిరేకంగా ఎవరు పాలించినా వారి తప్పిదాలను వేలేత్తి చూపెట్టింది. తెలంగాణ ప్రజల మనోభావాలను గుర్తించని రాజకీయ పార్టీలకు వ్యతిరేకంగా పోరాడింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి దశాబ్ది కాలం పూర్తవుతున్న సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో రాజకీయ పార్టీలు నిర్వహించిన పాత్ర ఇప్పుడు చేస్తున్న పెత్తనం పైన చర్చ జరగాల్సిన అవసరం ఉంది. తెలంగాణ రాష్ట్ర దశాబ్ది అవతారణోత్సవాలు ఘనంగా జరపడానికి ముందు తెలంగాణ ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడంలో వైఫల్యాలపై చర్చ జరగాల్సి ఉంది. వైఫల్యాలపై చర్చ జరిగి సానుకూల దిశగా పాలన సాగినప్పుడే రాష్ట్ర ఏర్పాటుకు ఒక సార్థకత చేకూరుతుంది. లేదంటే అనేక అనేక చారిత్రిక ఉద్యమాలు పురుడుపోసుకున్న ఈ నేలన మరో ఉద్యమం పుట్టక తప్పదు.



-ప్రజాపక్షం/ ఖమ్మం

# నట్టేట ముంచుతున్న నకిలీ విత్తనాలు..!



నకిలీ విత్తనాల ప్రతీ ఏటా రైతన్నలను నట్టేట ముంచుతున్నాయి. నకిలీల మూలంగా పంట దిగుబడులు లేక, పెట్టుబడులు రాక రైతులు ఆర్థికంగా కుదేళ్లవుతున్నారు. వీటి పుణ్యమాని ప్రతీ ఏటా రైతన్నలు లక్షల్లో నష్టాలు చవిచూస్తూ రోడ్డున పడుతున్నారు. నకిలీలపై చర్యలు తీసుకుంటున్నట్లు ప్రకటనలు వస్తున్నప్పటికీ అవి కేవలం ప్రకటనలకు మాత్రమే పరిమితం అవుతున్నట్లు తేటతెల్లమవుతోంది. ఈ అక్రమ వ్యాపారం వేళ్లూనుకు పోతూ రైతులను నట్టేట ముంచుతోంది. పకడ్బందీ ప్రణాళికతో పోలీసులు, వ్యవసాయ శాఖ టాస్క్ ఫోర్సు అధికారులు సంయుక్తంగా గట్టి నిఘా పెంచి దాడులు నిర్వహిస్తే తప్ప ఈ నకిలీ విపత్తు నుండి రైతులు బయటపడే పరిస్థితి లేదు. నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు తీసుకుంటా మంటూ ఇప్పటికే జిల్లా కలెక్టర్ డా.ప్రియాంక ఆలా, ఎస్పి రోహిత్ రాజ్‌లు డీలర్లతో సమావేశాలు నిర్వహించి హెచ్చరించారు.

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** కొద్దిరోజుల్లో తొలకరి పలుకరించ నుండగా పంటలు సాగుచేసుకునేందుకు రైతన్నల్లు సమాయత్తం అవు తున్నారు. ఇప్పటికే వేసవి దుక్కులు దున్నుకుని నేలను సారవంతం చేసుకునే ప్రయత్నాలు చేసున్నారు. ఈ ఏడాది రైతన్నలు భద్రాది కొత్త గూడెం జిల్లాలో సుమారు 2.50 లక్షల ఎకరాల్లో పత్తి , 60 వేల ఎక రాల్లో మిర్చి పంటలు సాగుచేసుకునేందుకు రైతులు ప్రణాళికలు చేసు కున్నారు. కాగా కొందరు అక్రమార్కులు డబ్బు సంపాదనే ధ్యేయంగా చేసుకుని నకిలీ విత్తనాలు రైతులకు అంటగడుతూ రైతుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారు.

**మార్కెట్‌లో నకిలీ విత్తనాల హల్‌చల్ ...**

మార్కెట్‌లో పత్తి, మర్చి నకిలీ విత్తనాలు హల్‌చల్ చేస్తున్నాయి. ప్రతీ ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా భద్రాద్రి ఏజెన్సీ ప్రాంతాన్ని నకిలీ గాళ్లు అడ్డాగా చేసుకుని విక్రయాలకు చూస్తున్నట్లు తెలుస్తోంది. ఈ వాన కాలం సీజన్ పంటలకు అనువుగా ఉన్నట్లు వార్తలు వస్తుండటంతో రైత న్నలు పంటల కాలం కోసం ఎదురు చూస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్లో మర్చి విత్తనాలకు మంచి గిరాకీ ఉంది. బ్రాండెడ్ కంపెనీలకు చెందిన కిలో మిర్చి విత్తనాలు రూ.1.50 లక్షల వరకు పలుకుతోంది. ఇదే అదు నుగా చేసుకుని అక్రమార్కులు బెంగుళూరు వంటి ప్రాంతాల నుండి కిలో నకిలీ మిర్చి విత్తనాలు రూ.20 వేలకు కొనుగోలు చేసి ఆకర్షణీయ మైన ప్యాకెట్లు చేసి కిలో రూ.80 వేల నుండి రూ.1.20 లక్షల చొప్పున విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. అధిక దిగుబడులు వస్తాయంటూ గ్రామాల్లో ఊకదంపుడు ప్రసంగాలు చేస్తూ ఏజెన్సీ రైతాంగాన్ని మాయ చేస్తున్నారు. తీరా ఆ విత్తనాలు విత్తిన తర్వాత కాతపూత లేక, దిగుబడి రాక నష్టాలు చవిచూస్తున్నారు. ఈ విత్తనాలకు అధికారుల అనుమ తులు ఉండటం లేదు. ఈ భాగోతం ఎక్కువగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో జరుగుతోంది. వీటికి బిల్లులు, రశీదులు కూడా ఇవ్వరు. నకిలీ విత్తనాలు వల్ల రైతులు నష పోయినప్పటికీ వాటికి పరిహారం కూడా చెల్లించకుండా విత్తనాలు అంటగట్టిన వారు ముఖం చాటేస్తున్నారు. దీంతో రైతులు సాగు చేసేందుకు ఎరువులు, పురుగుమందుల షాపుల్లో తెచ్చిన అప్పులు కట్టలేక పశువులను తెగనమ్మడంతో పాటు భార్య మెడలో ఉన్న పుస్తెలను కూడా అమ్ముకోవాల్సిన పరిస్థితి దాపురిస్తోంది.

**రైతులు అప్రమత్తంగా ఉండాలి...**

రైతులు విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలి. విత్తనాలు కొన్న తర్వాత ప్యాకెట్లపై ఉన్న బ్యాచ్ నెంబర్లు తో పాటు బిల్లులు తీసుకోవాలి. నకిలీల బెడద ఏజెన్సీలో పెరిగిపోవడంతో వ్యవ సాయాధికారులు సైతం పొలంబాటపట్టి రైతులకు అవగాహన కల్పిం చాలి. వ్యవసాయాధికారులు, పోలీసులు సంయుక్త దాడులు నిర్వహిం చాలి. ఎప్పటికప్పుడు రికార్డులు పరిశీలించాలి.విత్తనాలు కొనుగోలు చేసే వారి వివరాలు సేకరించి వారితో మాట్లాడాలి. ఆయా రైతు సంఘాల నాయకులు సైతం గ్రామాల్లో తిరిగి రైతులకు మేలు జరిగే పద్ధ తులు తెలియజేయాలి.

**రైతులు జాగ్రత్తగా వ్యవహరించాలి : జిల్లా వ్యవసాయాధికారి, వేల్పుల బాబూరావు**



విత్తనాలు కొనుగోలు చేసే రైతులు జాగ్రత్తగా వ్యవహరించాలని జిల్లా వ్యవసాయాధికారి సూచిస్తున్నారు. అధిక దిగుబడులు వస్తా యంటూ మాయమాటలు, రంగురంగుల బొమ్మలకు మోస పోకూడదు. అధీకృత డీలర్ల వద్ద మాత్రమే కొనుగులు చేసి బిల్లులు తీసుకో వాలి. విత్తనాలు కొన్నవెంటనే లాట్‌నెంబర్, బ్యాచ్ నెంబర్, వెరైటీ (రకం) నమోదు చేసుకుని ఉంచుకోవాలి. అధిక దిగుబుడులు వచ్చే విత్త నాలు ఇస్తామంటూ గ్రామాల్లోకి వచ్చే వారిపై దృష్టి సారించి అధికారు లకు సమాచారం ఇవ్వాలి. జిల్లాలో రెండు టాస్క్ ఫోర్సు టీంలు ఏర్పాటు చేశాం. గ్రామాల్లో వ్యవసాయ అధికారులు, పోలీసులతో కలిసి సంయుక్త దాడులు నిర్వహిస్తున్నాం.

# తాగు, సాగు నీటికి సత్వర పరిష్కారం

-పాలేరు నియోజకవర్గంలో
ఏడాది లోపు రోడ్లు, డ్రైనేజీలు పూర్తి
-మూడేళ్ల లోపు ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు
-పాలేరు నా సొంతిల్లు
-చక్కదిద్దే బాధ్యత నాదే : మంత్రి పొంగులేటి

**ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం :** పాలేరు నియోజక వర్గంలో సాగు, తాగునీటి సమస్య పరిష్కారానికి సత్వరం చర్యలు తీసుకోనున్నట్లు తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఎన్నికలప్పుడు వచ్చి ఓట్లు అడిగి ఆ తర్వాత ముఖం చాటేసే రకం కాదని నిరంతరం ప్రజల మధ్యనే ఉంటా మని మీ సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తామని ఆయన తెలిపారు. శుక్రవారం తిరుమలాయపాలెం మండలం కొక్కిరేణి, ఎర్రగడ్డ, గోపాల పురం, తిమ్మక్కపేట, తాళ్లచెరువు , బీరోలు, ఏలువారిగూడెం, బచ్చోడు తండా, సోలీపురం, బంధంపల్లి, రాజారం, పైనంపల్లి, జూపేడ, కాకర వాయి తదితర గ్రామాలలో పర్యటించారు. ఈ సందర్భంగా నేరుగా ప్రజలను కలిసి వినతులు స్వీకరించారు. ఇండ్లు, రేషన్ కార్డులు, పెన్షన్లు, రోడ్లు, విద్యుత్, డ్రైనేజీ సమస్యలకు సంబంధించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్య ధిక మెజార్టీతో తనను గెలిపించిన ప్రజల రుణం తీర్చుకుంటానని తెలి పారు. రాష్ట్ర వ్యాప్తంగా ఐదేండ్లలో ప్రతి నియోజక వర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు దక్కేలా చూస్తామని హామీ ఇచ్చారు. పాలేరు నియోజక వర్గంలో మూడేళ్ల లోపే ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఏడాది లోపు రోడ్లు, డ్రైన్లు పూర్తి చేస్తామని తెలిపారు. విద్య, వైద్యం ఇలా ఏ సమస్య వచ్చినా తీర్చేందుకు తాను ఎల్లవేళల అందుబాటులో ఉంటానని తెలి పారు. గ్రామ గ్రామాన పొంగులేటికి పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. ప్రతి ఒక్కరిని ఆత్మీయంగా పలుకరిస్తూ సమస్యలను అడిగి తెలుసుకు న్నారు. ఆయన వెంట తిరుమలాయపాలెం జెడ్పిటిసి బెల్లం శ్రీనివాస రావు, కాంగ్రెస్ నాయకులు చావా శివరామకృష్ణ, రామసహాయం నరే ష్‌రెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఘనంగా డాక్టర్ కాపా చంద్రకళ పుట్టినరోజు వేడుకలు

**ప్రజాపక్షం/వైరా:** గ్రేట్ విజన్ క్లబ్ అధ్యక్షురాలు వుంద్రు వరలక్ష్మి ఆధ్వర్యంలో లయన్ ఎంజెఎఫ్ డాక్టర్ కాపా చంద్రకళ పుట్టినరోజు సందర్భంగా వైరాకి చెందిన బిటెక్ థర్డ్ ఇయర్ చదువుతున్న అంకం శ్రీకాంత్‌కు ల్యాప్టాప్‌కు ఆర్థిక సహాయం అందించారు. లయన్ కంటి ఆసుపత్రి నందు ఆపరేషన్ చేయించుకున్న 25 మంది పేషెంట్స్‌కి పండ్లు, బ్రెడ్స్ అందించారు. ఈ కార్యక్రమంలో ఫాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ కాపా మురళీకృష్ణ మాట్లాడుతూ ఎంతోమంది పేద విద్యార్థులకు ఉన్నత చదువుల నిమిత్త ల్యాప్టాప్‌లు గ్రేట్ విజన్ క్లబ్ ద్వారా అందించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జివింటి కోఆర్డినేటర్ వుంద్రు శ్యామ్‌బాబు, ఆర్‌సి లగడపాటిప్రభాకర్‌రావు, తోట కూర శ్రీకాంత్, గంగవరపు కిషన్, జాలా పుల్లారావు, మహాలక్ష్మి , లయన్స్‌క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.




## రేపు టివి చౌదరి వర్ధంతి



**ప్రజాపక్షం/ ఖమ్మం:** భారత కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకులు, రైతు సంఘం నేత టివి చౌదరి నాల్గవ వర్ధంతి సభ ఈనెల రెండున ఆదివారం గిరిప్రసాద్ భవన్‌లో జరుగుతుందని సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ నేడొక ప్రకటనలో తెలిపారు. భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా కార్యదర్శిగా, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షునిగా, జాతీయ సమితి సభ్యునిగా వివిధ హోదాలలో చౌదరి పని చేశారని ప్రసాద్ తెలిపారు. ఆయన వర్ధంతి సభలో సిపిఐ రాష్ట్ర జిల్లా నాయకులు పాల్గొంటారని ప్రసాద్ తెలిపారు.

## మిత్రుని కుటుంబానికి ఆర్థిక చేయూత



**ప్రజాపక్షం/వైరా:** వైరాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంటర్మీడియట్ 1996—1998 బ్యాచ్ మిత్రుల సహకా రంతో వైరా మిత్రుడు వాంకుడోతు శ్రీని వాస్ సతీమణి ఆరోగ్య సమస్య కార ణంగా ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న మిత్రుని కుటుంబానికి తోటి మిత్రులు అందరూ కలిసి ఆరోగ్య పరిస్థితి తెలుసుకొని పరా మర్శించి కొంత ఆర్థిక సహాయం అందించి చేయూతనందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మిత్రులు శ్రీనివాసరావు, కొండలరావు, అఫ్జల్, కృష్ణయ్య, శేషగిరి, రఫీ, సీతారాములు, వెంక ట్‌లు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే రాందాస్‌నాయక్‌ని కలిసిన సింగరేణి మండల కాంగ్రెస్ నాయకులు



**ప్రజాపక్షం/కారేపల్లి:** వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్‌ని శుక్ర వారం కొత్తగూడెంలోని తన నివా సంలో కారేపల్లి మండల కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్థానిక కాంగ్రెస్ నాయకులు ఆర్‌ఎంపి డాక్టర్ చెవుల చందు ఎమ్మెల్యేకు శాలువా కప్పి సత్కరించారు. మండ లంలోని కాంగ్రెస్ పార్టీ బలోపేతా నికి ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు ఇమ్మడి తిరుపతిరావు, మల్లెల నాగేశ్వరరావు, గుగులోతు శ్రీనునాయక్, ఎండి.యాకూబ్, తోగారి శ్రీను, హేమ్లానాయక్, మాంగల్యనాయక్ పాల్గొన్నారు.

## ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** మండలం లోని ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య కు పాల్పడ్డ ఘటన మండలం లో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి మండలం లోని రామచంద్రాపురం గ్రామానికి చెందిన గోపి (25) అనే యువకుడు శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య కు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు పని కి వెళ్లి తిరిగి వచ్చే సరికి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో తల్లిదండ్రులు బోరున విలపించారు. ఆత్మహత్య కు గల కారణాలు తెలియాల్సి ఉంది.

## ఎస్‌బిఐ బ్రాంచ్ మేనేజర్ సేవలు ప్రశంసనీయం



**ప్రజాపక్షం/ తల్లాడ :** తల్లాడ ఎస్‌బిఐ మేనేజర్ సేవలు ప్రశంసనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. తల్లాడలో శుక్రవారం బదిలీపై ఖమ్మం మెయిన్ బ్రాంచ్ వెళ్తున్న తల్లాడ బ్రాంచ్ మేనేజర్ షేక్.ఇబ్రహీంను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ గత 22 నెలలుగా తల్లాడ బ్రాంచ్ పరిధిలో ఆయన విశిష్ట సేవలు అందించారని కొనియాడారు. తల్లాడ బ్రాంచ్ పరిధిలో 4వేలు ఇన్సూరెన్స్‌లు చేర్పించడంలో బ్యాంక్ మేనేజర్, సిబ్బంది కృషి అమోఘమన్నారు. విధి నిర్వహణలో మేనేజర్ తల్లాడ బ్రాంచ్‌కి పేరు తెచ్చే విధంగా పనిచేశారన్నారు. ఈసందర్భంగా మేనేజర్‌ను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వ్యాపారులు దారా విష్ణుమోహన్‌రావు, దారా శ్రీనివాసరావు, కర్నాటి లక్ష్మారెడ్డి, వెచ్చ సుధాకర్, వైరా జెడ్పిటిసి నంబూరి కనకదుర్గ సుధా నాగేశ్వరరావు, వైరా మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ ధూపాటి భద్రరాజు, బెల్లంకొండ ఆంజనేయులు, పులబాల వెంకటేశ్వర్లు, వేమిరెడ్డి వెంకటనారాయణ, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

# రెండు హోటళ్లకు జరిమానాలు

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** హోటల్స్ నుంచి వచ్చే వ్యర్థాల వల్ల కాలువలు పూడుకుపోతుండడంతో రెండు హోటళ్లకు మున్సిపల్ కార్పోరేషన్ అధికారులు జరిమానా విధించారు. ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ ఆదర్శ్ సురభి ఆదేశాల మేరకు హోటళ్ల నుంచి వచ్చే వ్యర్థాల వల్ల కాలువలు పూడుకుపోతున్న వాటిపై అసిస్టెంట్ కమిషనర్ సందీప్, మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. అందులో భాగంగా శుక్రవారం ఖమ్మం నగరంలోని కిమ్స్ దర్బార్, రెస్టిన్ హోటళ్లకు జరిమానా విధించారు. హోటల్, రెస్టారెంట్ యజమానులు ఎవరైనా కాలువలో వెస్ట్ ఫుడ్ వేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. హోటళ్లు, రెస్టారెంట్లలో మిగిలిన ఆహారాన్ని మున్సిపల్ సిబ్బంది స్వీకరించడానికి వచ్చినప్పుడు ఇవాళి తప్ప కాలువల్లో వేయవద్దని సూచించారు. కాలువల్లో వేయడం వల్ల అవి పూడుకుపోయి నీరు నిల్వ ఉండి దోమలు వ్యాప్తి చెంది ప్రజలు అనారోగ్యానికి గురయ్యే అవకాశం



ఉందని తెలిపారు. హోటల్, రెస్టారెంట్ యజమానులు వెస్ట్ ఫుడ్ ఎక్కడ వేస్తున్నారన్నది శానిటరి ఇన్‌స్పెక్టర్లు పరిశీలించాలని తెలిపారు. కాలువల్లో వేసే వారిపై తగు చర్యలు తీసుకోవడంతో పాటు జరిమానాలు విధించాలని శానిటరి ఇన్‌స్పెక్టర్లను కమిషనర్ ఆదేశించారు.

# పొగాకు వద్దు.. ఆరోగ్యమే ముద్దు



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** పొగాకు వద్దు ఆరోగ్యమే ముద్దంటూ ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని పెవిలియన్ గ్రౌండ్ వాకర్స్ సభ్యులు సిగరెట్ బొమ్మను దగ్ధం చేశారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవ సందర్భంగా శుక్రవారం పెవిలియన్ మైదానంలో వాకర్స్ అసోసియేషన్ సభ్యులు వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఎనిమిది అడుగుల సిగరెట్‌ను తయారు చేసి పొగాకు ద్వారా ఉత్పతయ్యే పదార్థాలను వ్యతిరేకిస్తున్నామని తెలియజేస్తూ సిగరెట్ బొమ్మ పై సంతకాలు చేసి దగ్ధం చేశారు. పొగాకు వల్ల ఎన్నో ఆరోగ్య సమస్యలు తలెత్తడంతో పాటు ప్రాణాలు కూడా పోతున్నాయని వాటికి దూరంగా ఉండాలని కోరారు.ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు రాకం శ్యాంబాబు, సెక్రటరీ కొండమీది వెంకట్, సభ్యులు శొంఠి వెంకట్, కార్మిక నాయకులు మందా వెంకటేశ్వర్లు, తాళ్లూరి వేణు, వెంకట్‌బాబు, విజయ్‌కుమార్, వెంకటేశ్వర్లు, కృష్ణమూర్తి, శ్రీనివాస్, లక్ష్మణ్‌రావు, మల్లికార్జున్, అమీర్ అలీ తదితరులు పాల్గొన్నారు.

## వాకర్స్ ఆధ్వర్యంలో సిగరెట్ బొమ్మ దగ్ధం

# ఏఆర్ ఎస్‌ఐను సన్మానించిన సిపి

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఉద్యోగ విరమణ పొందిన ఏఆర్ ఎస్‌ఐ ఎండి గౌస్‌పాషా ను ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పూలమాలలు, శాలువలతో ఘనంగా సన్మానించారు. శుక్రవారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో జరిగిన సన్మాన కార్యక్రమంలో సిపి సునీల్ దత్ పాల్గొని మాట్లాడుతూ సుదీర్ఘకాలంగా వివిధ విభాగాలలో బాధ్యతయుతమైన విధులు నిర్వహించి పోలీస్ శాఖకు ఎనలేని సేవలు అందించి గౌస్‌పాషా పోలీస్ అధికారుల మన్ననలు పొందారని కొనియాడారు. రిటైర్‌మెంట్ తన వృత్తికే కాని తన వ్యక్తిత్వానికి కాదని గౌస్‌పాషాకు విధి నిర్వహణలో తోడ్పాటునందించిన వారి కుటుంబ సభ్యులకు ఈ సందర్భంగా సిపి కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగ విరమణ పొందిన గౌస్‌పాషా ఇకపై వారి కుటుంబ సభ్యులతో వారి భావి జీవితాన్ని ఆనందంగా ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు. అనంతరం గౌస్‌పాషాను శాలువలతో సత్కరించారు. శాఖపరంగా రావాల్సిన బెనిఫిట్స్‌ను త్వరితగతిన అందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ కామరాజు, పోలీస్ అసోసియేషన్ ప్రతినిధులు వెంకటేశ్వర్లు, మోహన్‌రావు, పంతులు, ఏఆర్ ఎస్‌ఐ సంగయ్య తదితరులు పాల్గొన్నారు.



# గుర్తింపు లేని పాఠశాలలను గుర్తించండి

**-ఫీజులను నియంత్రించండి**
**-ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో డిఈవోకు వినతి**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** గుర్తింపు లేని ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలను గుర్తించి వాటిని సీజ్ చేయాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్‌ఎఫ్) ఖమ్మంజిల్లా సమితి కార్యదర్శి ఇటికాల రామకృష్ణ తెలిపారు. గుర్తింపు లేని పాఠశాలలను గుర్తించి అడ్మిషన్ల ముసుగులో ఫీజుల మోత మోగిస్తున్న, యూనిఫాం, స్టేషనరీ, పుస్తక విక్రయాలు నిర్వహిస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం ఏఐఎస్‌ఎఫ్ ఖమ్మంజిల్లా సమితి ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖర శర్మకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థల యజమాన్యాలు అనుమతులు లేకుండానే కోట్ల రూపాయలు దండుకుంటున్నాయన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు ఫీజుల మోత మోగిస్తున్నా అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారన్నారు. గుర్తింపు లేని పాఠశాలలను గుర్తించి వాటిపై చర్యలు తీసుకోవడంలో అలసత్వం ప్రదర్శిస్తున్నారని ఆయన ఆరోపించారు. డోనేషన్ల పేరుతో అధిక ఫీజులు వసూలు చేయడంతో పాటు పుస్తకాలు, యూనిఫాం ఇతరత్రా అంటూ సపరేట్‌గా ప్రైవేటు పాఠశాలలు వసూళ్ల దందాకు పాల్పడుతున్నాయన్నారు. విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలో ఎస్సి, ఎస్టి, బిసి మైనార్టీ విద్యార్థులకు 25 శాతం ఫీజు రాయితీ ఇవ్వాలని నిబంధన ఉన్నా వాటిని ఉల్లంఘిస్తున్నారన్నారు. జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ఇంటర్నేషనల్ స్కూల్ పేర్లతో నర్సరీ, ఎల్‌కెజి, యుకెజి లకు లక్షలకు పైగా ఫీజు వసూలు చేస్తున్నారని వాటిపై చర్యలు తీసుకోవాలని కోరారు. తక్షణమే జిల్లా కలెక్టర్ స్పందించి ఇంటర్నేషనల్ స్కూళ్ల పేరుతో పుట్టగొడుగులా పుట్టుకొస్తున్న కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలన్నారు. ఫీజు నియంత్రణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని, అనుమతులు లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శులు మధు, శివ, అయ్యప్ప, నరేష్, గోపి, సాయి తదితరులు పాల్గొన్నారు.




# ఘనంగా ఎంఎల్‌సి తాతా మధు పుట్టిన రోజు వేడుకలు

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** బిఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎంఎల్‌సి తాతా మధుసూదన్ పుట్టిన రోజు వేడుకలను బిఆర్‌ఎస్ పార్టీ కార్యాలయం తెలంగాణ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఎంఎల్‌సి తాతా మధుసూదన్ పుట్టిన రోజు సందర్భంగా నిర్వహించిన పుట్టిన రోజు వేడుకల్లో జెడ్పి ఛైర్మన్ లింగాల కమల్‌రాజు ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యకర్తలకు, నాయకులకు అన్ని వేళల అందుబాటులో ఉంటూ అండగా నిలిచే ఎంఎల్‌సి తాతా మధుసూదన్ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ నగర అధ్యక్షులు పగడాల నాగరాజు, తెలంగాణ ఉద్యమ కారులు ఉప్పాల వెంకటరమణ, మందడపు శంకర్‌రావు, పగడాల నరేందర్, తాజుద్దీన్, శీలంశెట్టి వీరభద్రం, వెంకటప్పారావు, భారతి, నాగేశ్వరరావు, సతీష్, ఉమాశంకర్, సద్దాం, విజయ్, మంచా నాయక్, ఆర్మీ రవి, శ్రీను, మాధవి, కిరణ్, మునాఫ్, దినేష్, పవన్, వాసు తదితరులు పాల్గొన్నారు.



# ముగిసిన టెన్నిస్ శిక్షణా శిబిరం

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** టెన్నిస్ వేసవి శిక్షణా శిబిరం ముగిసింది. మే ఒకటి నుంచి ప్రారంభమైన ఈ శిక్షణా శిబిరం ఈనెల 31 శుక్రవారంతో ముగిసింది. శిబిరం ముగింపు కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖర శర్మ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ప్రతి విద్యార్థి ఏదో ఒక క్రీడా అంశంలో శిక్షణ పొందడం ఎంతో మంచిదని తన భవిష్యత్తుకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ప్రతి ఒక్కరు క్రీడా స్ఫూర్తిని చాటాలని, శిక్షణలో పాల్గొన్న చిన్నారులను డిఈవో అభినందించారు. ఈ కార్యక్రమంలో టెన్నిస్ జిల్లా అధ్యక్షులు బాలసాని విజయ్‌కుమార్, గౌరవాధ్యక్షులు కొండా శ్రీధర్, డాక్టర్ కూరపాటి ప్రదీప్‌కుమార్, డాక్టర్ ఎంజివి ప్రవీణ్, ఉపాధ్యక్షులు జానిపాషా, సంపెట ఉపేందర్, రాంచందర్, పిట్టల కామేశ్వరి, సహాయ కార్యదర్శి జ్యోజి చాకో, రెడ్డి, సాయి, శివ, కోశాధికారి చలపతి, దుగ్గినేని చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.




# ధూమపానానికి దూరంగా ఉండాలి

**ప్రజాపక్షం/ తల్లాడ :** పొగాకు ఉత్పత్తులైన సిగిరెట్, బిడిలు, చుట్టలు తాగటం వల్ల వారితో పాటు పక్కనున్న వారికి కూడా అనేక వ్యాధులు వచ్చే అవకాశం ఉందని, ప్రతిఒక్కరూ ధుమపానంకు దూరంగా ఉండాలని తల్లాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రత్నమనోహర్ అన్నారు. శుక్రవారం ప్రపంచ పోగాకు నివారణ దినోత్సవం సందర్భంగా ఆసుపత్రికి వచ్చిన రోగులకు పోగాకు వాడటం వల్ల వచ్చే అనర్థాలపై వివరించారు. పోగాకు తాగటం వల్ల ఊపిరితిత్తుల క్యాన్సర్, గొంతు క్యాన్సర్, రక్తపోటు,రక్తనాళాలు మూసుపోవటం, ఆకలిలేకపోటం, క్షయవ్యాధి, నిమోనియా వ్యాధి రావవటం జరుగుతుందని తెలిపారు. దీని వలన మనిషి అతితక్కువ వయస్సులో చనిపోయే ప్రమాదం ఉందని, పోగాకు ఉత్పత్తులకు దూరంగా ఉంటూ తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. అనంతరం ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, ఎంఎల్ హెచ్పీలు, ఎఎన్‌ఎంలు, పిహెచ్‌సి సిబ్బంది పాల్గొన్నారు.




# ఘనంగా సూపర్ కృష్ణ జయంతి వేడుకలు

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** సూపర్ స్టార్ కృష్ణ జయంతి వేడుకలను ఖమ్మంజిల్లా సూపర్ స్టార్ కృష్ణ, మహేష్ సేన ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం సూపర్ స్టార్ కృష్ణ 81వ జయంతి సందర్భంగా ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలోని మాతా శిశు సంరక్షణ కేంద్రంలో వేడుకలను నిర్వహించారు. ఆసుపత్రిలోని రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. వారి సమక్షంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సూపర్ స్టార్ కృష్ణకు మరణం లేదని ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారని తెలిపారు. సినీ రంగంలో ఆయన ప్రస్థానం మరువలేనిదన్నారు. ఎన్నో రికార్డులను నెలకొల్పడంతో పాటు రాజకీయ రంగంలో కూడా ఆయన చెరగాని ముద్ర వేసుకున్నారని కృష్ణ మహేష్ సేన బాధ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖమ్మంజిల్లా సూపర్ స్టార్ కృష్ణ మహేష్ సేన జిల్లా గౌరవాధ్యక్షులు తోట రంగారావు, జిల్లా అధ్యక్షులు దేవభక్తుని కిషోర్ బాబు, నగర అధ్యక్షులు మునగాల బాబు, కె. వెంకటేశ్వరరావు, ఎస్. మనోహర్, ఖమ్మంజిల్లా కన్వీనర్ బాణాల లక్ష్మణ్, నగర కన్వీనర్ పులిపాటి సంపత్‌కుమార్, నగర గౌరవ అధ్యక్షులు నాగార్జున, బ్రహ్మం, సహాయ కార్యదర్శి నల్లబెల్లి గౌతమ్, మాలోత్ రవి, సుధాకర్, నర్సింహారావు, శివ, మహేష్ చౌదరి, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



## ఆదర్శ కమ్యూనిస్టు బాలస్వామి



ప్రజాపక్షం/ చింతకాని : నిత్యం ప్రజా సమస్యలే ఏజెండాగా పనిచేసిన నారపోగు బాలస్వామి ఆదర్శ కమ్యూనిస్టు అని సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ అన్నారు. శుక్రవారం కొదుమూరు మాజీ సర్పంచ్ నారపోగు బాలస్వామి వర్ధంతి సందర్భంగా బాలస్వామి స్థూపం వద్ద సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి పార్టీ జెండా ఎగురవేశారు. వర్ధంతి సభనుద్దేశించి పోటు ప్రసాద్ మాట్లాడుతూ ఎన్నో ఆటుపోటులను ఎదుర్కొని పార్టీ అభివృద్ధిలో బాలస్వామి కృషి ఎనలేనిదని అన్నారు. గ్రామ సర్పంచ్‌గా చేసిన అభివృద్ధి కొదమూరు గ్రామం ఉన్నంతకాలం బాలస్వామి పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. బాలస్వామి ఆశయ సాధన కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కొండపర్తి గోవిందరావు, మండల కార్యదర్శి పావులూరి మల్లికార్జున రావు, వ్య.కా.సం జిల్లా అధ్యక్షులు పగిడిపల్లి ఏసు, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు కూచిపూడి రవి, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు అబ్బూరి మహేష్, మాజీ సర్పంచ్‌లు పాతూరు వెంకటేశ్వర్లు, నక్కనబోయిన సుజాత, ఎంపిటిసి నారపోగు హేమ, నాగార్జున, గ్రామ కార్యదర్శి చల్లగుండ వెంకటేశ్వరావు, వేముల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## 460 గ్రాముల గంజాయి స్వాధీనం



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ఖమ్మం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ 1 ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించి 460 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకుని నలుగురు యువకులను అరెస్టు చేశారు. ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వో కృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం ఎస్ ఆర్ గార్డెన్ పరిసర ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. నలుగురు యువకులు అనుమానాస్పదంగా సంచరిస్తుండడంతో వారిని అదుపులోకి తీసుకుని విచారించగా వారు ఖమ్మం నిజాంపేటకు చెందిన గుత్తికొండ యశ్వంత్, తిరుమలాయపాలెం మండలం కొక్కిరేణి గ్రామానికి చెందిన చింతినేని విజేంద్ర ప్రసాద్, ఖమ్మం పాండురంగాపురంకు చెందిన షేక్ అమీర్, డోర్నకల్‌కు చెందిన తేజావత్ నితిన్ లుగా గుర్తించారు. వారి వద్ద నుండి 460 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వీరు గుర్తు తెలియని వ్యక్తి వద్ద గంజాయి సేవించేందుకు కొనుగోలు చేసినట్లు విచారణలో తెలిందన్నారు. వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌హెచ్‌వో కృష్ణ తెలిపారు. గంజాయి అక్రమ రవాణా చేసినా, విక్రయించినా చట్టరీత్య తగు చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఈ తనిఖీల్లో ఎస్ఐలు ఎస్. జయశ్రీ, కె. సాయిబాబా, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## లైసెన్స్‌డ్ డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలి



ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ : రైతులు లైసెన్స్‌డ్ డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి ఎం విజయనిర్మల సూచించారు. శుక్రవారం ఖమ్మం రూరల్ మండలంలోని ఆరెకోడు, తనగంపాడు గ్రామాలలోని రైతులతో అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...రైతులందరూ విత్తనాలను తీసుకునేటప్పుడు తప్పకుండా విత్తనాల బిల్లులను తీసుకోవాలన్నారు. అంతేకాకుండా విత్తనాల ప్యాకెట్లపై ఉన్న లేబుల్‌ను బిల్లులో రాసిన వివరాలను సరిచూసుకొని కొనుగోలు చేసుకోవాలన్నారు. లూజ్ ప్యాకెట్లలో,గుడ్డ సంచులలో బిల్లులు లేకుండా డైరెక్ట్‌గా కంపెనీ నుంచి వచ్చినవని మోసం చేసి అమ్మేవారి వద్ద కొనుగోలు చేయవద్దన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వి. నాగేశ్వరరావు, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

## ఫిజికల్ డైరెక్టర్ రెహమాన్‌కు ఘన సన్మానం



ప్రజాపక్షం/ అశ్వారావుపేట : అశ్వారావుపేటలోని వ్యవసాయ కళాశాలో పనిచేస్తున్న ఎస్.రెహమాన్ 60సంవత్సరాలు పూర్తిచేసుకుని రిటైర్డ్ అయిన సందర్భంగా శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆయనను కళాశాల యాజమాన్యం ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా రెహమాన్‌కు శాలువాలు, పుష్పగుచ్చాలతో సత్కరించారు. అనంతరం జరిగిన సభలో కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జె.హేమంత్‌కుమార్ మాట్లాడుతూ కళాశాలలో గత 27సంవత్సరాలుగా ఫిజికల్ డైరెక్టర్‌గా విధి నిర్వహణలో బాధ్యతయుతంగా నడుచుకుంటూ ఆయన అందించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# ఫీజు దోపిడీ..!

-మధ్య తరగతి కుటుంబాలే టార్గెట్
-ప్రైవేట్ విద్యాసంస్థలో నియంత్రణ ఏది..!?



ప్రజాపక్షం/కరకగూడెం: ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు ఇష్టానుసారంగా ఫీజులుపెంచుతూ దోపిడికి పాల్పడుతున్నారని, వారిని శిక్షించాలని ఎస్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గం ప్రేమ్ కుమార్, భద్రాది జిల్లా విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు జిమ్మిడి ప్రకాష్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రతి విద్యా సంవత్సరం 20 నుండి 30శాతం వరకు ఫీజులు పెంచుకుపోతున్నారు. పాలకులు ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల దోపి డికి కళ్లెం వేస్తామని ఏళ్ళ తరబడి నుండి చెబుతున్నా ఆచరణలో పెట్టడం లేదన్నారు. దీంతో యాజమాన్యాలు ఎవరికి వారు ఫీజులు పెంచుకుంటూ పోతుండడంతో పేదింటి విద్యార్థులకు ప్రైవేట్ విద్య అందని ద్రాక్షలా మారిందన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా అధికారులు తెలిపిన లెక్కల ప్రకారం చాలా ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయన్నారు. యాజమాన్యాలు ఎల్ కేజీ నుండి మొదలుకొని పదవ తరగతి వరకు వేలల్లో ఫీజులు వసూళ్లు చేస్తున్నారన్నారు. ఖమ్మం, కొత్తగూడెం, ఇల్లందు, మధిర, పినపాక, సత్తుపల్లి, భద్రాచలంతో పాటు ఇంకా నియోజకవర్గాల పరిధిలో ప్రైవేట్ పాఠశాలలు పెద్ద మొత్తంలో ఉండగా కనీసం మండల కేంద్రంలో రెండు నుండి మూడు, ఇక చాలా ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయన్నారు. యాజమాన్యాలు వసూళ్లు చేస్తున్న ఫీజుల విషయాన్ని పరిశీలిస్తే ఎల్ కేజీ చదివే విద్యార్థికి రూ. 25 వేల నుండి మొదలు కొని రూ. 40 వేల వరకు వసూళ్లు చేస్తున్నారన్నారు. ఇలా 5వ తరగతి వరకు ప్రతి సంవత్సరం తరగతికి 20 నుండి 30 శాతం వరకు ఫీజులు పెంచుకుంటుపోతున్న పరిస్థితి ఉందన్నారు. 6వ తరగతి తరువాత ఐఐటీ ఫౌండేషన్ పేరుతో అదనంగా వసూళ్లు చేస్తున్నారన్నారు. 6వ తరగతి విద్యార్థికి 60 వేల నుండి 75 వేల వరకు ఫీజు తీసుకుంటున్నారన్నారు. 10వ తరగతి విద్యార్థులకు రూ. 80 నుండి రూ.1.5 లక్షల ఫీజును ముక్కుపిండి వసూళ్లు చేస్తున్నారన్నారు. దీనికి తోడు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఐఐటీ, టాలెంట్, ఈ కొత్త కొత్త పేర్లతో ఇల్లు వంటి ఆకర్షణీయమైన పేర్లతో కార్పోరేట్ స్థాయిలో విద్యను అందిస్తామంటూ బ్రోచర్లను ముద్రిస్తూ గ్రామ స్థాయిలో నుండి మొదలుకొని పట్టణ స్థాయి వరకు పెద్ద ఎత్తున ప్రచారాలు నిర్వహిస్తున్నారన్నారు. దీనికి తోడు పాఠ శాలలో పని చేయాలంటే ప్రతి ఉపాధ్యాయులకు, సిబ్బందికి అడ్మిషన్లు చేపించాలనే నిబంధనలు పెడుతు న్నారన్నారు.

**ఫీజు నియంత్రణ ఏది..?**

ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులు నియంత్రణ చేయడంలో పాలకులు పూర్తిగా విఫలమయ్యారన్నారు. విద్యాసంవత్సరం ప్రారంభంలో కాస్తా హడావుడి చేస్తూ వారి దోపిడిని అడ్డుకట్ట వేస్తామని ప్రకటనలు చేస్తూ చేతులు దులుపు కుంటున్నారన్నారు. విద్యతోనే అభివృద్ధి సాధ్యమని గ్రహిం చిన సామాన్యులు సైతం తమ పిల్లల భవిష్యత్ కోసం వారి తహతకు మించి ప్రైవేట్ పాఠశాలల్లో తమ పిల్ల లను చదివించేందుకు ఆసక్తి చూపుతున్నారన్నారు. దీన్ని ఆసరాగా చేసుకుంటున్న ప్రైవేట్ పాఠశాలల యాజమా న్యాలు ఇదే అదునుగా చేసుకోని వారిని జలగల్లా పీల్చు కుంటూ ఫీజుల దోపిడికి పాల్పడుతున్నారన్నారు. గత పాలకులు ఫీజు నియంత్రణ కోసం ఎన్నో జీఓలు ఇచ్చారన్నారు. అవి ఏవి కూడా అమలుకు నోచుకోలేదన్నారు. వసూళ్లు చేసిన ఫీజుల్లో యాజమాన్యాలు 50 శాతం వేతనాలకు, 15 శాతం పాఠశాల నిర్వహణకు, మరో 15 శాతం విద్యుత్, అద్దెకు, ఇంకో 15 శాతం సిబ్బంది బీమా భవిష్యత్ నిధికి కేటాయించాలని నిబంధనలు జారీ చేసిన ఎక్కడ కూడా ఇది అమలుకు నోచుకోకపోవడం గమనార్హం అన్నారు.

**ప్రతిదీ వ్యాపారమే...**

ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు విద్యతో పాటు ప్రతిది వ్యాపారంగానే చూస్తున్నారన్నారు. విద్యార్థుల నుండి అందినకాడికి దోచుకునేందుకు యూనిఫాంల నుండి మొదలుకొని టై, బెల్టు, షూలతో పాటు పాఠ్య పుస్తకాలు, నోటు బుక్కులు, పెన్ను, పెన్సిళ్ళ వరకు అమ్మేందుకు ప్రత్యేకంగా స్కూల్ ఆవరణంలోనే దుకాణాన్ని తెరుస్తున్నారన్నారు. ఏ విద్యార్థికి ఏది అవసరం ఉన్న అందులోనే కొనుగోలు చేయాలన్న నిబంధన పెడుతున్నారన్నారు. ఆ వస్తువులను బహిరంగ మార్కెట్ కంటే 50 శాతం అధిక ధరలకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారన్నారు. విద్యార్థుల తల్లి దండ్రుల అమాయకత్వాన్ని ఆసరా చేసుకోవడంతో పాటు ప్రభుత్వ ఆజమాయిషి లేకపోవడంతో వీరు ఆడిందే ఆట పాడిందే పాటగా సాగుతుందని, ఇప్పటికైన పాలకులు స్పందించి ప్రైవేట్ పాఠశాలల దోపిడికి కళ్లెం వేయ్యాలని విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులు కోరుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం నియోజకవర్గం ఇన్చార్జి జాడి దినేష్, దుర్గం ప్రవీణ్, ములుగు జిల్లా ఎంఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి బాడిశ సువాస్, పాల్గొన్నారు.

# ఆదమరిస్తే అంతే సంగతులు..!

- ప్రమాదకరంగా మారిన మధిర రైల్వే ఓవర్ బ్రిడ్జి
- పట్టించుకోని అధికారులు

ప్రజాపక్షం/ మధిర : నియోజకవర్గ కేంద్రమైన మధిర నడిబొడ్డులో ఉన్న రైల్వే ట్రాక్‌పై వాహనాల రాకపోకలు సాగించేందుకు ఏర్పాటు చేసిన రైల్వే ఓవర్ బ్రిడ్జి మరమ్మత్తులకు గురై ప్రమాదకరంగా మారింది. రైల్వే ఓవర్ బిడ్జి నిర్మాణం పూర్తయిన తర్వాత కొంత కాలం వరకు ప్రజలకు సేవలందించింది. గడిచిన పదేళ్ళ కాలంలో ఈ బ్రిడ్జిపై ఉన్న స్లాబ్‌లు, జాయింట్ సీళ్లు ప్రాంతాలు పాడైపోగా మరి కొన్ని ప్రాంతాల్లో ఉండకపోవటంతో రోడ్డు గుంతలమయంగా మారింది. నిత్యం వందలాది వాహనాలు ఈ బ్రిడ్జిపై ప్రయాణిస్తుంటాయి. అయితే గడిచిన కొంతకాలంగా బ్రిడ్జిపై ఏర్పడిన గుంటలు వలన ప్రమాదకరంగా మారి దీనిపై ప్రయాణించే ప్రయాణీకులు రోడ్డు ప్రమాదాలకు గురై గాయాలు పాలు కావడంతో పాటు మృత్యువాత పడుతున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత ఆర్అండ్‌బి అధికారులు మాత్రం పట్టించుకోవటం లేదని స్థానిక ప్రజలు మండిపడుతున్నారు. గత రెండు రోజుల క్రితం ఎర్రుపాలెం మండలం బనిగండ్లపాడు గ్రామానికి చెందిన ఆర్టిసి డిపో డ్రైవర్ రాజశేఖర్ అనే వ్యక్తి రైల్వే ఓవర్ బ్రిడ్జిపై ప్రయాణిస్తుండగా రోడ్డుపై ఉన్న గుంతలను తప్పించబోయే క్రమంలో ప్రమాదానికి గురై మృతి చెందిన సంగతి తెలిసిందే. గత కొన్ని రోజులుగా రైల్వే ఓవర్ బ్రిడ్జి రోడ్డు ప్రమాదాలు జరగుతున్నా సంబంధిత అధికారుల్లో చలనం లేదని ప్రజలు తమ ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. అలాగే ఈ రైల్వే ఓవర్ బ్రిడ్జిపై ప్రయాణించే కొత్త వారి సంగతి చెప్పనక్కర్లేదు. బ్రిడ్జి మరమ్మత్తులకు గురై గుంతలు ఏర్పడటంతో దీనిపై ప్రయాణించే ప్రయాణీకులు ప్రాణాన్ని అరిచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ ప్రయాణిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి యుద్ధప్రతిపాదికన రైల్వే ఓవర్ బ్రిడ్జి రోడ్డుకు మరమ్మత్తులు చేపట్టి రోడ్డు ప్రమాదాలను నివారించి ప్రయాణీకులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



# కూర 'గాయాలు'..!

- అమాంతం పెరిగిపోయిన కూరగాయల ధరలు
- తెగుళ్లు, అకాల వర్షాలే కారణం
- బెంబేలెత్తిపోతున్న జనం



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : కూరగాయల కూర తిందామంటే మనస్సుకు గాయాలు అవుతున్నాయి. అకాల వర్షాలు పడటంతో కూరగాయల పంటలకు పలు రకాల తెగుళ్లు ఆశించి దిగుబడి పూర్తిగా తగ్గిపోయింది. దీంతో ధరలు అమాంతంగా పెరిగిపోయాయి. ఏ కూరగాయ ముట్టుకున్నా కిలో రూ.60 పై మాటే. ఇక టమాట పరిస్థితి మాట్లాడేలా లేదు. కిలో టమాట ఏకంగా రూ.70 నుండి, రూ.80కి అమ్ముతున్నారు. ఇక బెండకాయ, దొండకాయ, ఆలుగడ్డ,, దోసగాయ, ఆనపకాయ, చామదుంప, బీరకాయ రూ.60 కి అమ్ముతున్నారు. బీన్స్ ధర ఏకంగా రూ.150 పలుకుతోంది. మూడు, నాలుగు నెలలకు దిగుబడి వచ్చే కూరగాయల పంటల కురిసిన అకాల వర్షాల కారణంగా పంటలను చీడపీడలు ఆశించడంతో తిగుబడిపై ప్రభావం పడింది. ఎకరం టమాట తోటకు వాస్తవంగా రావాల్సిన దిగుబడి కంటే సాగానికి పైగా తక్కువ వచ్చినట్లు రైతులు తెలుతున్నారు. ఇక పచ్చిమిర్చి వ్యవహారానికి వస్తే పూత , పిందె వరకు పాగానే ఉన్నప్పటికీ కాయ ఎదుగుదలకు వచ్చిన తర్వాత తొడెం దగ్గర మాడిపోయి ఎండిపోతున్నట్లు రైతులు అంటున్నారు.

**బెంబేలెత్తుతున్న జనం...**

కూరగాయల ధరలు అమాంతం పెరిగిపోవడంతో ప్రజలు బంబెలెత్తిపోతున్నారు. ఏ కూరగాయ కొందామన్నా అందనంత దూరంలో ఉండటంతో కొనేలా తినేలా లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధరలు దిగొచ్చేంత వరకు సంతృప్తికరమైన కూరల భోజనం తినలేమంటూ ఆవేదన వ్యక్తం చేస్నున్నారు.

# భానుడి భగ భగ..!

-ఇళ్లల్లో నుండి బయటకు రాని ప్రజలు
- వేడిమి, ఉక్కపోతతో తీవ్ర ఇబ్బందులు



ప్రజాపక్షం/ అశ్వారావుపేట : గత వారంరోజులుగా అధిక ఉష్ణోగ్రతలు, ఉక్కపోతలతో ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒకపక్క వచ్చిపోయే విద్యుత్‌కు తోడు ఉదయం నుండి సాయంత్రం వరకు తీవ్రమైన ఎండ, వాడ గాల్పులతో ప్రజలు ఇళ్లల్లో నుండి బయటకు రావాలంటే వణికిపోతున్నారు. ఈ ప్రాంతంలో దట్టమైన అడవులు, ముఖ్యంగా ఉద్యానవన తోటలు, నిత్యం భూగర్భ జలాలు నీళ్ల తోటలకు ఉపయోగిస్తుంటారు. అయినప్పటికీ ఎండ వేడిమికి ఉష్ణోగ్రతలు పెరిగిపోయి ప్రజలు ఇళ్ల నుండి బయటకు రావాలంటనే భయపడుతున్నారు. ఈ ప్రాంతంలోనే ఇంత వేడి ఉంటే నీటి సదుపాయాలు, తోటలు, చెట్లు లేని ప్రాంతాల్లో ప్రజల పరిస్థితి ఎలా ఉంటుందోనని మాటల్లో చెప్పనక్కర్లేదు. పట్టణంలో నిత్యం రద్దీగా ఆటోలు ప్రజలతో కిటకిటలాడీ వాణిజ్య సముదాయాలు జనం లేక విలవిలలాడుతున్నాయి. బస్టాండ్ సెంటర్‌లో సైతం ప్రజలు కన్పించటం లేదు. మరికొన్ని రోజులు ఈ విధమైన ఉష్ణోగ్రత్లు ఉంటే ప్రజలు తీవ్రమైన పరిస్థితులను ఎదుర్కొవాల్సి వస్తుంది. ముఖ్యంగా పశుపక్షాదులు సైతం ఎండ తీవ్రతకు కొట్టుమిట్టాడుతున్నాయి. అశ్వారావుపేట ప్రాంతంలో 42డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనటుల తెలుస్తుంది. గ్రామీణ ప్రాంతంలోని ప్రజలు వీలైనంత వరకు చెట్ల క్రిందకు చేరుకుని సాయంత్రం వరకు సేద తీర్చుకుంటున్నారు. రుతుపవనాలు వచ్చి కొంత చల్లబడితే జన, పశుపక్షాదులు ఊపిరి పీల్చుకుంటాయి.

# ఉచిత కరాటే శిక్షణ అభినందనీయం



ప్రజాపక్షం/సత్తుపల్లి: లయన్ బుడోకాన్ కరాటే హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో నెల రోజుల పాటు జరిగిన కరాటే ఉచిత శిక్షణా తరగతులు శుక్రవారం తో ముగిశాయి. ఈ ముగింపు కార్యక్రమానికి గంగారం 15వ బెటాలియన్ కమాండెంట్ వెంకట రాములు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ అనేక ఏళ్లుగా వేసవిలో ఉచిత కరాటే శిక్షణ ఇస్తున్న ఆ సంస్థ వ్యవస్థాపకులు, కరాటే నేషనల్ రిఫరి మాస్టర్ పిచ్చయ్య ను ప్రశంసిస్తూ సత్కరించారు. ఇక్కడ శిక్షణ పొందిన విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించడం అభినందనీయమన్నారు. విశ్వశాంతి విద్యాలయం ప్రిన్సిపల్ పసుపులేటి నాగేశ్వరరావు, హంస అవార్డు గ్రహీత ప్రముఖ ఆర్టిస్ట్ గొడ్డేటి బాలకృష్ణ లు మాట్లాడుతు కరాటే శిక్షణ ద్వారా శారీరిక దారుఢ్యం, మానసిక ఆరోగ్యం మెరుగు పడడంతో పాటు ఆత్మవిశ్వాసం, నైతిక , మానవీయ విలువలు పెంపుందుతాయి అన్నారు. కరాటే నేషనల్ రిఫరీ పిచ్చయ్య మాట్లాడుతూ 30 ఏళ్లుగా ఈ ప్రాంత విద్యార్థులకు కరాటే లో శిక్షణ ఇవ్వడం ద్వారా వారు రాష్ట్ర , జాతీయ స్థాయిలో బహుమతులు సాధించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ బాధ్యులు వెంకట్రావు, విశ్రాంత ఉపాధ్యాయులు సలీం, నవ చైతన్య స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు తోట కిరణ్, కళాకృతి ఫైన్ ఆర్ట్స్ అకాడమీ నిర్వాహకులు బాలకృష్ణ, సృజన, లైవ్ సంస్థల నిర్వాహకులు మాస్టర్ పిచ్చయ్యను సత్కరించారు. వేసవి శిబిరంలో శిక్షణ పొందిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు



ప్రజాపక్షం/బూర్గంపాడు: బూర్గంపాడు మండలంలో ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ముజాహీద్ద్ స్పష్టం చేశారు. శుక్రవారం మండలంలోని సారపాక బ్రిడ్జ్ సమీపంలోని, గొమ్మూరు ఇసుక రవాణా రహదారులకు జేసీబీ సహాయంతో కందకాలను ఆయన దగ్గర ఉండి తవ్వించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఇసుక అక్రమ రవాణా చేస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదన్నారు. ఇదే రీతిలో మండలంలోని ఇసుక అక్రమ రవాణా రహదారులకు కందాకాలను తీపిస్తామని అన్నారు. ఇసుక అక్రమ రవాణా చేసే వారిపై రెవిన్యూ అధికారులకు సమాచారం అందించాలన్నారు. ఈకార్యక్రమంలో ఆర్ఐ నరసింహారావు, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## విత్తనాలు బ్లాక్ మార్కెట్‌కు తరలించ లేదు

-జిల్లా వ్యవసాయ అధికారిణి విజయనిర్మల



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్/ తల్లాడ : తల్లాడ సొసైటీ నుంచి పిల్లి పెసర విత్తనాలను బ్లాక్ మార్కెట్‌కు తరలించినట్లు వచ్చిన వార్తల్లో ఎటువంటి నిజం లేదని వాటిని ఎక్కడికి తరలించ లేదని ఖమ్మం జిల్లా వ్యవసాయ అధికారిణి విజయనిర్మల తెలిపారు. బ్లాక్ మార్కెట్‌కు విత్తనాలను సొసైటీ సిబ్బంది తరలించారని పత్రికల్లో, మీడియాలో వచ్చిన వార్తల నేపథ్యంలో జిల్లా వ్యవసాయ అధికారిణి విజయనిర్మల శుక్రవారం స్పందించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సహాయ రిజిస్ట్రార్, సత్తుపల్లి వ్యవసాయ సహాయ సంచాలకులతో కలిసి తల్లాడ సొసైటీకి వెళ్లి ఆమె విచారణ చేశారు. వ్యవసాయ శాఖ విస్తరణ అధికారుల ద్వారా అనుమతులు ఇచ్చినట్లు 220 సంచులు 44 క్వింటాళ్లకు సంబంధించి ఈనెల 29న అనుమతి ఇవ్వడం జరిగిందన్నారు. ఇచ్చిన పర్మిట్లకు సంచులు సొసైటీ వారు ఇష్యూ బ్యాగ్ ద్వారా నగదు తీసుకుని అందుకు అనుగుణంగా సంచులు ఇవ్వడం జరుగుతుందని ఆమె తెలిపారు. తల్లాడ సిఈవో లేఖ ద్వారా తెలిపిన వివరాల ప్రకారం హమాలీలు వారికి కావాల్సిన సంచులు పర్మిట్లు తీసుకోకుండా దాచుకోవడం వల్ల గొడవ జరిగినట్లు హమాలీలతో మాట్లాడి అట్టి సంచులను రైతులకు అందజేసినట్లు ఆమె తెలిపారు. ఇట్టి విషయంలో వ్యవసాయ శాఖాధికారుల నిర్లక్ష్యం కాని, నిబంధనలు ఉల్లంఘించడం, విత్తనాలు దాచడం, తరలించడం కాని జరగ లేదని వ్యవసాయ అధికారిణి తెలిపారు. జిల్లాలో కావాల్సిన పచ్చిరొట్ట విత్తనాలను సమకూర్చడం జరుగుతుందని రైతులు ఎవరు ఆందోళన చెందవద్దని ఆమె తెలిపారు.

## సర్వీస్ నౌ సర్టిఫికెట్స్ సాధించిన ఎస్‌బిఐటి విద్యార్థి



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ప్రముఖ బహుళ జాతి కంపెనీ సర్వీస్ నౌ సర్టిఫికెట్స్‌కు ఎస్‌బిఐటి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థి అర్హత సాధించినట్లు కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ శుక్రవారం తెలిపారు. ఎస్‌బిఐటిలో కంప్యూటర్ సైన్స్ నాల్గవ సంవత్సరం విద్యార్థి ఎంవిఎన్ ప్రభు ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థ అయిన సర్వీస్ నౌ నిర్వహించే ప్రతిభ పరీక్షలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి రెండు సర్టిఫికెట్లు సాధించినట్లు ఆయన తెలిపారు. తమ కళాశాల విద్యార్థులు రాణించడం పట్ల కళాశాల అధ్యాపకులను, విభాగపు అధిపతి, ప్రతిభ కనబర్చిన విద్యార్థి ప్రభును ఈ సందర్భంగా గుండాల కృష్ణ అభినందించారు. ఐటిసి అకాడమీ, బహుళ జాతి సాఫ్ట్‌వేర్ కంపెనీ సర్వీస్ నౌ సంయుక్తంగా నిర్వహించిన ప్రతిభ పరీక్షల్లో తమ విద్యార్థి ప్రభు చక్కటి ప్రతిభ కనబర్చినట్లు కరస్పాండెంట్ జి. ధాత్రి తెలిపారు. ఈ సర్టిఫికెట్లు సాధించడం ద్వారా వార్షిక ఆదాయం రూ. 16 లక్షల నుండి రూ. 48 లక్షల వరకు అందుకునే అవకాశాన్ని ప్రభు సాధించారని ఆమె తెలిపారు. సర్టిఫైడ్ సిస్టం అడ్మినిస్ట్రేటర్, అప్లికేషన్ డెవలపర్ వంటి రెండు క్లిష్టమైన పరీక్షల్లో విద్యార్థి ప్రభు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ తెలిపారు. ఐదు మాడ్యూల్స్‌ను పూర్తి చేసి 80 గంటల నిడివి గల కోర్సులో నిర్వహించే ఈ పరీక్ష ద్వారా కేవలం సర్వీస్ నౌ కంపెనీయే కాకుండా ఇతర బహుళ జాతి కంపెనీల ఉద్యోగాలకు అర్హత సాధించడం హర్షించదగ్గ విషయమన్నారు. సహకరించిన ఐటిసి అకాడమి రీజినల్ కో ఆర్డినేటర్ షేక్ గౌస్‌పాషాకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కె. అమిత్ బిందాజ్, అకాడమిక్ డైరెక్టర్లు గంధం శ్రీనివాసరావు, ఎవివి శివప్రసాద్, జి. ప్రవీణ్‌కుమార్, జే. రవీంద్రబాబు, ఎన్. శ్రీనివాసరావు, టిపివో ఎన్. సవిత, కో ఆర్డినేటర్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## 12వ వార్డులో స్పెషల్ డ్రైవ్



ప్రజాపక్షం/ మధిర : మధిర మున్సిపాల్టీ పరిధిలోని 12వ వార్డులో ప్రజలు ఎదుర్కొంటున్న పారిశుద్ధ్య సమస్యను దృష్టిలో ఉంచుకుని డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క సతీమణి మల్లు నందిని ఆదేశాల మేరకు శుక్రవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈసందర్భంగా వార్డులోని డ్రైనేజిల క్లీనింగ్, చెత్తచెదారాల తొలగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ మొండితోక నాగరాణి, 15వ వార్డు కౌన్సిలర్ కోన ధనికుమార్, కాంగ్రెస్ నాయకులు పారుపల్లి విజయ్, రంగా శ్రీనివాస్, మొండితోక సుధాకర్, గద్దల నాగరాజు, గద్దల రుతమ్మ, మేదర యశోద తదితరులు పాల్గొన్నారు.

## అవసరమైన విత్తనాలు
# అందుబాటులో ఉన్నాయి..



-రైతులు ఆందోళన చెందవద్దు
-ఒకే రకం బ్రాండ్ల పై ఆసక్తి వద్దు
-విత్తన దుకాణాలను పరిశీలించిన కలెక్టర్ విపి గౌతమ్

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** రైతులకు అవసరమైన విత్తనాలు జిల్లాలో అందుబాటులో ఉన్నాయని జిల్లా కలెక్టర్ విపి గౌతమ్ తెలిపారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ విపి గౌతమ్ ఖమ్మం నగరంలోని బర్మాషెల్ రోడ్డు గాంధీచౌక్‌లోని విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. దుకాణాలలో స్టాక్, అమ్మకం రశీదులను పరిశీలించారు. విత్తనాల ప్యాకెట్ల క్యూఆర్ కోడ్లు పరిశీలించారు. దుకాణ లైసెన్సులు, స్టాక్, అమ్మకం వివరాలను తనిఖీ చేశారు. ఏ పంట విత్తనాలు, ఏఏ రకాలు రైతులు అడుగుతున్నారని దుకాణ దారులను అడిగి తెలుసుకున్నారు. విత్తనాల కొనుగోలుకు వచ్చిన రైతులతో సంభాషించారు. పోయిన సారి ఏ పంట వేశారు.ఈ సారి ఏ పంట వేస్తున్నది వంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అన్ని బ్రాండ్ల విత్తనాలు ఒకటేనని ఒకటే బ్రాండ్ అందరు కొని ఆ బ్రాండ్ డిమాండ్ పెంచి నష్ట పోవద్దని ఏ బ్రాండ్ అయినా వాతావరణ పరిస్థితుల నిర్వహణ పైనే దిగుబడి వస్తుందని రైతులకు కలెక్టర్ అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వానాకాలం 2024 పంటకు జిల్లాలో అవసరమైన మేర విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు రైతులకు సమస్యలు లేకుండా చర్యలు తీసుకున్నామన్నారు. జిల్లాలో ఎక్కడ నకిలీ విత్తనాలు విక్రయం కాకుండా గట్టి నిఘా ఏర్పాటు చేశామని వ్యవసాయ, పోలీస్ శాఖాధికారులతో టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేశామన్నారు. నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై చట్ట పరంగా తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. విడగా ఉన్న సంచుల్లోని విత్తనాలను కొనుగోలు చేయవద్దని ఆయా కంపెనీ లేబుళ్ల కలిగిన విత్తన ప్యాకెట్లను కొనుగోలు చేయాలన్నారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు డీలర్ నుంచి రశీదు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. వ్యవసాయ శాఖ ద్వారా గుర్తింపు పొందిన డీలర్ల నుంచి మాత్రమే కొనుగోలు చేయాలన్నారు. విత్తనాల ఖాళీ ప్యాకెట్లను, బిల్లులను పంట కాలం పూర్తయ్యే వరకు భద్రంగా ఉంచుకోవాలని కలెక్టర్ సూచించారు. పత్తి పంట సాగయ్యే రెండు లక్షల ఎకరాలకు నాలుగు లక్షల ప్యాకెట్ల పత్తి విత్తనాలు అవసరం కాగా జిల్లాలో ఇప్పటికే 4.50 లక్షల ప్యాకెట్ల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మరో లక్ష ప్యాకెట్లను రైతులకు అందుబాటులో ఉంచేందుకు తగు చర్యలు తీసుకున్నామన్నారు. ఇప్పటి వరకు 45వేల ప్యాకెట్లు మాత్రమే అమ్మకాలు జరిగినట్లు కలెక్టర్ తెలిపారు. వ్యవసాయ శాఖ ద్వారా పచ్చిరొట్ట విత్తనాలైన జనుము, జిలుగు, పిల్లి పెసర విత్తనాలను 60 శాతం సబ్సిడీపై అందించడం జరుగుతుందన్నారు. జిల్లాకు 21వేల క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాల కేటాయింపు జరగగా 14వేల క్వింటాళ్లు జిల్లాకు వచ్చాయని 11వేల క్వింటాళ్లు అమ్మకం జరిగినట్లు, 3వేల క్వింటాళ్లు రైతులకు అందుబాటులో ఉన్నాయన్నారు. ఇంకా రావాల్సిన విత్తనాలు త్వరలోనే వస్తాయన్నారు. విత్తనాల కొరకు రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని ఎటువంటి కొరత లేదని జిల్లాలో అవసరానికి మించి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. రైతులు విత్తనాల కోసం ఎటువంటి ఆందోళన చెందకుండా ప్రశాంతంగా కొనుగోలు చేయాలని కలెక్టర్ కోరారు.ఈ కార్యక్రమంలో ఖమ్మం డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు శ్రీనివాసరావు, ఖమ్మం అర్బన్ వ్యవసాయ అధికారి కిషోర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## బట్టబయలైన యూట్యూబర్ ఓకే సాయి బాగోతం




-పెట్టుబడి లేకుండా లక్షాధికారి కావచ్చనే కాన్సెప్ట్‌తో...
-788మంది నుంచి రూ.18వేలు చొప్పున వసూళ్లు
-ట్రాప్ షిప్పింగ్ కోర్సు పేరుతో వంచన
-వంచనతో అనతికాలంలోనే కోట్లకు పడగెత్తిన యువకుడు
-యూట్యూబ్ ఛానల్ ద్వారా వెలుగులోకి ఓకే సాయి బాగోతం

**ప్రజాపక్షం/కారేపల్లి:** అతి సామాన్య కుటుంబం నుంచి అనతి కాలంలోనే కోట్లకు పడగెత్తిన పాతికేళ్ల యువకుడి గురించి కారేపల్లి మండలంలో ఏడాది నుంచి చ్ఛ జరుగుతూనే ఉంది. ఐదేళ్లలోనే ఈ యువకుడు కోటీశ్వరుడు ఎలా అయ్యాడనే విషయం ఆ యువకుడు ఉండే తండావాసులు కూడా ఆశ్చర్యానికి గురవుతుఊ రకరకాలుగా చెప్పుకుంటుండగా ఓ యూట్యూబ్ ఛానల్ ఓకే సాయి యూట్యూబ్ ఛానల్ వీడియో వాట్సాప్ గ్రూపుల్లో వైరల్ అవుతుంది. ఖమ్మం జిల్లా కారేపల్లి మండలంలోని సూర్యతండాకు చెందిన ఓ యువకుడు ఓకే సాయి పేరుతో గత ఐదేళ్లుగా యూట్యూబర్‌గా చలామణి అవుతూ కోట్లకు పడగెత్తాడు. సూర్యతండాలో ఓ కాంట్రాక్టర్ దగ్గర పనిచేసే గుమస్తా కొడుకు. ఎటువంటి ఆస్తిపాస్తులు లేకుండా కోటీశ్వరుడు అయ్యాడని అందరి నోట ఆశ్చర్యానికి గురిచేసి అతను ఎలా ఎదిగాడనే దానిపై కోటి ప్రశ్నలు తలెత్తాయి. నిఘా విభాగాలు కూడా ఇతనిపై దృష్టి సారించకపోవడంతో అవకాశాలను కందిపుచ్చుకున్న ఆ యువకుడు వందలాది మంది నుంచి కోర్సుల్లో జాయినింగ్ పేరుతో కోట్లాది రూపాయలు వసూలు చేశాడు. 788 మంది నుంచి రూ.18వేలు చొప్పున వసూలు కేవలం స్మార్ట్ ఫోన్ ఉంటే చాలు పెట్టుబడి లేకుండా తక్కువ కాలంలోనే లక్షాధికారి కావచ్చని నమ్మబలికి తన మాటల గారడితో వేలాది మందిని వంచిస్తూ కోట్లకు పరిగెత్తాడు. లక్షలు సంపాదించవచ్చు అని వేలాది రూపాయలు చెల్లించి కోర్సులు చేసిన వారంతా ఎటువంటి ప్రయోజనం లేకపోవడంతో మోసపోయామని మరో యూట్యూబర్‌తో వారి గోడు వెళ్లబోసుకున్నారు.

**కారేపల్లిలో కోట్లతో భారీ భవనం...**

విజయవాడలో ఫార్మసి చదివి యూట్యూబర్‌గా చలామణి అవుతున్న సాయి స్వగ్రామం కారేపల్లికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ పాతికేళ్ల యువకుడు ఒంటి మీద అరకిలో బంగారంతో, ఓ ఖరీదైన కారులో తిరుగుతూ కారేపల్లిలో సుమారు రూ.2కోట్లతో విలాసవంతమైన భవనాన్ని కూడా ఇటీవల నిర్మించాడు. అన్ని హంగులతో నిర్మించిన ఈ భవనం గురించి కూడా కారేపల్లిలో సూర్యతండాలో రకరకాలుగా చర్చించుకుంటున్నారు. అసలు ఈ యువకుడు ఏం చేసి సంపాదిస్తున్నాడు అనేది అందరికి ప్రశ్నార్థకమైన పోలీస్ శాఖ మాత్రం ఎందుకు ఆరాతీయడం లేదనేది కూడా ప్రశ్నార్థకమైంది. 8 నెలల క్రితం హైదరాబాద్‌లో కేసుకు సంబంధించి కోర్టుకు హాజరు కాకపోవడంతో ఇతనికి వారెంట్ ఇష్యూ అయింఇ. ఆ సమయంలో కారేపల్లి పోలీసులు అరెస్ట్ చేసి హైదరాబాద్ పోలీసులకు అప్పగించారు. ఆ కేసు కూడా ఓ చీ టింగ్ వ్యవహారమేని ఇప్పుడు వెలుగు చూస్తుంది. నిఘా వ్యవస్థలు దృష్టి సారిస్తే ఈ ఓకే సాయి అక్రమాలన్ని వెలుగుచూస్తాయి. తెలుగు యూట్యూబ్ చరిత్రలోనే అతిపెద్ద స్కామ్‌గా ఓకే సాయి మోసాలను మరో యూట్యూబ్ ఛానల్ ఆధారాలతో సహా వెలుగులోకి తేవడం గమనార్హం.

## ఆవిర్భావ వేడుకలకు కార్యాలయాలు సిద్ధం

**ప్రజాపక్షం/కల్లూరుః** తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావ కార్యక్రమాలకు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు ఆర్డీవో రాజేంద్ర తెలిపారు. జెండా ఆవిష్కరణలు, కార్యాలయాలు విద్యుత్ దీపాలతో అలంకరణ లాంటి కార్యక్రమాలు చేస్తున్నట్లు ఆర్డీవో పేర్కొన్నారు. ఈ కార్యక్రమం అన్ని శాఖల అధికారుల సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని డివిజన్‌లో చేస్తున్నట్లు వివరించారు. ఈ మేరకు అందరూ తహశీల్దార్‌లకు అధికారులకు ఆదేశాలు అందించినట్లు పేర్కొన్నారు.



## విత్తన దుకాణాల్లో టాస్క్‌ఫోర్స్ పోలీసుల తనిఖీలు



**ప్రజాపక్షం/చంద్రుగొండ:** మండల కేంద్రమైనా చంద్రుగొండలోని విత్తన విక్రయ దుకణాల్లో శుక్రవారం కొత్తగూడెం టాస్క్‌ఫోర్స్ పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. విత్తనాల విక్రయ రికార్డులను, రశీదులను పరిశీలించారు. ఈసందర్భంగా టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ రాజ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతులు లేని విత్తనాలను రైతులకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పత్తి విత్తన ప్యాకెట్‌కు రశీదును తప్పని సరిగా ఇవ్వాలన్నారు. కొనుగోళ్లు, అమ్మకాలపై రికార్డులపై రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. ఎంత మంది రైతులకు విత్తనాలను అమ్మింది. ఏ రకం విత్తనాలు అమ్మకాలు అనే విషయాలు స్పష్టంగా నమోదు చేయాలన్నారు. అధిక ధరలకు విత్తనాలు అమ్మితే చట్టపరంగా చర్యలుంటాయన్నారు. ఈకార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వినయ్, ఏఈవో శ్రీనివాస్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## ధూమపానం ఆరోగ్యానికి హానికరం




**ప్రజాపక్షం/చంద్రుగొండ:** ధూమపానం ఆరోగ్యానికి హానికరమని మెడికల్ ఆఫీసర్ కనకం తనూజ అన్నారు. శుక్రవారం వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రపంచ పొగాకు నిరోధక దినోత్సవంగా ర్యాలీ, ప్రతిజ్ఞ చేశారు. ఈసందర్భంగా మెడికల్ ఆఫీసర్ తనూజ మాట్లాడుతూ ఇకపై ఎటువంటి పొగాకు ఉత్పత్తులను వాడానని ఎవరికి వారు నిర్ణయం తీసుకోవాలన్నారు. పొగాకు ఉత్పత్తులు వాడటం వల్ల ఊపిరితిత్తుల వ్యాధులు, క్యాన్సర్ వంటి వ్యాధులు వస్తాయన్నారు. ఈకార్యక్రమంలో హోమియోపతి వైద్యులు ప్రవీణ వైద్య సిబ్బంది లక్ష్మి, రమ్యశ్రీ, ఇమామ్, పద్మ, శ్రీనివాస్, జ్యోతి, అక్కులయ్య తదితరులు పాల్గొన్నారు.

## పొగతాగుట ఆరోగ్యానికి హానికరం



**ప్రజాపక్షం/కల్లూరుః** ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శనివారం కల్లూరు మండల పరిధిలోని చెన్నూరు ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. పొగాకు ఆరోగ్యాన్ని కాదు జీవితాన్ని కూడా పాడు చేస్తుందని, పొగాకుకు దూరంగా ఉండండి.. ఆరోగ్యంగా జీవించండి అంటూ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. విలువైన జీవితాలను ఆగమాగం చేసుకోవద్దని, పొగాకు దూరంగా ఉండి సమాజంలో విలువగా జీవించేందుకు కృషి చేయాలని కోరారు. ఉప కేంద్రముల పరిధిలోని గ్రామాలలో పొగాకు వ్యతిరేక కార్యక్రమాలను నిర్వహించి ప్రజలకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు తబస్సుమ్ , పర్యవేక్షకులు శ్రీకర్, ఆరోగ్య కార్యకర్తలు సునీత, చిట్టెమ్మ, కృష్ణవేణి, నాగమణి, ఆశలు సిబ్బంది పాల్గొన్నారు.

## ఏజెన్సీలోని ఎస్సీలను ఆదుకోవాలి



**ప్రజాపక్షం/లక్ష్మీ దేవిపల్లిః** రాష్ట్ర ఏర్పడ్డాక ఏజెన్సీ ప్రాంత ఎస్సీ కులాలకు తీరని అన్యాయం జరిగింది. పాలన సౌలభ్యం కోసం ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్రం సగభాగం వెనుకబడ్డ ఏజెన్సీ ప్రాంతంలో ఉంది. ఎస్సీ కులాలు స్థానిక రిజర్వేషన్ అమలు చేసి ఆదుకోవాలని, ప్రజాపాలన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొత్తగూడెం సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏజెన్సీ ప్రాంత ఉమ్మడి జిల్లాలు నాలుగు, 86 మండలాలు, సుమారు 10లక్షల జనాభా కలిగిన వారి తరపున ప్రాతినిధ్యం వహించడానికి గ్రామ సచివాలయంలో, మండల పరిషత్, జిల్లా పరిషత్‌లో ఏజెన్సీ ప్రాంత ఎస్సీ కులాల సమస్య చెప్పుకునే అవకాశం లేకుండా రాజకీయ వివక్షత చూపడాన్ని తీవ్రంగా ఖండించారు. ఇందిరమ్మ రాజ్యం కాంగ్రేస్ ప్రజాపాలన ప్రభుత్వంలో గత ఉమ్మడి రాష్ట్రంలో మాదిరిగాఏజెన్సీ ప్రాంతం ఎస్సీ కులాల జెడ్పిటిసి, ఎంపిటిసి, వార్డు సభ్యుల స్తానిక రిజర్వేషన్ ఉద్యోగ ఉపాధి నామినేట్ పదవులు అమలు చేస్తారని ఆశిస్తున్నాం అన్నారు. ఈ సమావేశంలో షెడ్యూల్డ్‌కులాల హక్కుల పోరాట సమితి అడ్వైజర్ గొల్లపల్లి దయానంద, షెడ్యూల్డ్ కులాల హక్కుల పోరాట సమితి రాష్ట్ర నాయకులు ఎనగంటి కృపాకర్, గాంధిపతం గిరిశం, కన్నం చంద్రయ్య, చలిగంటి కొమరయ్య, కొంపటి నాగరాజు, కండే రాములు తదితరులు పాల్గొన్నారు.

# రెండో ఏఎన్ఎం శ్రమను, త్యాగాన్ని ప్రభుత్వం గుర్తించాలి



**-17 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న రెండో ఏఎన్‌ఎంలను క్రమబద్ధీకరించాలి**
**-ఏఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి నర్సింహం**
**-ఉత్సాహంగా రెండో ఏఎన్‌ఎంల ప్రథమ మహాసభ**

**ప్రజాపక్షం/లక్ష్మీ దేవిపల్లి:** దశాబ్దంన్నరకు పైగా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో భాగస్వామ్యం అవుతున్న రెండో ఏఎన్‌ఎంల శ్రమను, త్యాగాన్ని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి క్రమబద్ధీకరణ ప్రక్రియ చేపట్టాలని ఏఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నర్సింహం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏఐటియుసి అనుబంధ రెండో ఏఎన్‌ఎం అసోసియేషన్ భద్రాద్రి జిల్లా ప్రథమ మహాసభ ఏఐటియుసి జిల్లా కార్యాలయం శేషగిరి భవన్ నందు జరిగింది. సమావేశానికి ముఖ్య అతిధిగా హాజరైన నర్సింహా మాట్లాడుతూ 17 సంవత్సరాలుగా ద్వితీయ శ్రేణి ఏఎన్‌ఎంలు గ్రామీణ, పట్టణ ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందిస్తూ ఆరోగ్య సమాజ నిర్మాణంలో భాగస్వామ్యమవుతున్నారన్నారు. కరోనా కష్టకాలంలో తమ ప్రాణాలను సైతం పనంగా పెట్టి సేవలందించారని, అనేక మంది సిబ్బంది కరోనా బారిన పడి మృత్యువాతపడ్డారన్నారు. రెండో ఏఎన్‌ఎంలు తమను క్రమబద్ధీకరించాలని, భీమా సౌకర్యం కల్పించాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని దశాబ్దాలుగా పోరాడుతున్నా పాలకులు పెడచెవిన పెడుతుందన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి షేక్ సాబీర్‌పాషా, ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి నారటి ప్రసాద్ మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం చెల్లించాలనే సుప్రీంకోర్టు సూచనను పాలకులు తుంగలో తొక్కి రెండో ఏఎన్‌ఎంలకు కనీస వేతనాలు చెల్లించకుండా వారి శ్రమను దోచుకుంటున్నారని విమర్శించారు. వీరికి గుర్తింపు లేదని అన్నారు. రాష్ట్రంలో గత ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబర్16లో రెండో ఏఎన్‌ఎంలను చేర్చి రెగ్యులర్ చేయాలని, సమ్మె కాలంలో ప్రభుత్వం ఇచ్చిన వంద శాతం గ్రాఫ్, శాలరీని అమలు చేయాలని, ప్రసూతి సెవలవులు, టిఏడిఏ బిల్లులు, ఇతర బకాయిలు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తక్షణమే త్రిసభ్య కమిటీని సమావేశపరిచ్చి పనిభారం తగ్గించేందుకు ప్రభుత్వం చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఏఐటియుసి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోట రామాంజనేయులు, జిల్లా కార్యవర్గ సభ్యులు కంచర్ల జమలయ్య, ఇందిర, సొందె కృష్ణవేణి, సత్యవాణి, కొమరం బాలనాగమ్మ, బానోతు పార్వతి, ప్రియాంక, ఇందిర, అరుణ, సారిక, పుష్ప, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ శాఖల్లో అధికారులకు

# అవినీతి నిరోధకశాఖ భయం..!



**-కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత అవినీతి అధికారులపై ప్రత్యేక నిఘా**
**-కీలక శాఖలపై దృష్టి**
**-బెంబేలెత్తుతున్న అవినీతి అధికారులు**

**ప్రజాపక్షం/వైరా:** ప్రభుత్వ కార్యాలయాల్లో కొంతమంది అధికారులకు అవినీతి నిరోధక శాఖ భయం పట్టుకుంది. అవినీతి అక్రమాలపై దూకుడు పెంచిన ఏసిబి టాస్క్‌ఫోర్స్ అధికారులు గత కొన్ని రోజులుగా జరుగుతున్న ఏసిబి దాడులతో కొంతమంది లంచావతరాల అధికారులు గుండెల్లో రైళ్ళు పరుగెడుతున్నాయి. పలు కీలక శాఖలపై విజిలెన్స్ టాస్క్‌ఫోర్స్ నిఘా జరుగుతున్నట్లుగా సమాచారం. కొన్ని ప్రభుత్వ శాఖల్లో సంవత్సరాలు తరబడి ఉంటున్న ఇటీవల బాధ్యలు చేపట్టిన అవినీతి అధికారులపై ఏసిబి అధికారులు ప్రత్యేక దృష్టి సారించారని సమాచారం. కీలక ప్రభుత్వ శాఖల్లో లంచావతారులుగా పేరున్న అధికారుల పట్ల అవినీతి నిరోధకశాక దూకుడు పెంచింది. ఇటీవల పలు చోట్ల ఏసిబి దాడుల్లో కొన్ని శాఖల్లో అధికారులు లంచం తీసుకుంటూ పట్టుబడ్డ తీరు పలు శాఖల అధికారుల్లో అలజడి సృష్టిస్తున్నాయి. లంచాలకు మరిగిన అధికారులను ప్రజలు డైరెక్ట్‌గా పట్టిస్తూ కనువిపిఉప్ప కలిగిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అవినీతి అధికారులపై నిఘా పెంచి రాజీ లేకుండా వారిని కటకటాలకు పంపుతుంది. అధికారులకు విధి నిర్వహణలో పూర్తి స్వేచ్ఛ నివ్వడంతో ఏసిబి, విజిలెన్స్, టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు ముమ్మరం చేశారు. రెవెన్యూ, టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు ముమ్మరం చేశారు. రెవెన్యూ, రిజిస్ట్రేషన్, పంచాయతీరాజ్, నీటిపారుల, ఫిషరీస్, పోలీస్, ఆర్‌డిఐ, మైనింగ్, మున్సిపాల్ ట్రెజరీ శాఖల్లోనే కొంతమంది అధికారుల జవాబుదారి తనం లేకుండా పనులకు లంచం ఇస్తేనే పనులు చేస్తున్నారు అనే ఆరోపణలు లేకపోలేదు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు లబ్దిదారుల చేతికి అందాలంటే ప్రతి పనికి లంచం అనే సూత్రాన్ని కొంతమంది అధికారులు అస్త్రంగా ప్రయోగిస్తున్నారని అంటున్నారు.

**కీలక శాఖల్లో పెరిగిన అవినీతి...?**

పంచాయతీరాజ్, రెవెన్యూ, రిజిస్ట్రేషన్, మున్సిపాలిటీ, నీటిపారుదల శాఖల్లో ప్రతీ పనికి కొంతమంది అధికారులకు లంచం ఇవ్వాల్సిన పరిస్థితి జిల్లాలో ఉంది అని ఆరోపణలు లేకపోలేదు. కొంతమంది ప్రజాప్రతినిధులు కూడా తమ వాటా వసూలు చేసుకునేందుకు అధికారులను పావులుగా వాడుకుంటున్నట్లు ఆరోపణలు లేకపోలేదు. వ్యవసాయ శాఖ లైసెన్సుల కోసం సీడ్స్ డీలర్లతో కుమ్మక్కై అవుతున్నట్లు ఆరోపణలు లేకపోలేదు.

**రిజిస్ట్రేషన్ శాఖలపై విజిలెన్స్ టాస్క్‌ఫోర్స్ విచారణ...**

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో హద్దు లేకుండా పోతున్న అవినీతి కార్యకలాపాలపై లోతుగా దర్యాప్తు జరిపేందుకు టాస్క్‌ఫోర్స్ విజిలెన్స్ అధికారులు విచారణ జరుగుతున్నట్లు సమాచారం. రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అటెండర్ల ద్వారా కొంతమందిని నియమించుకొని అనుమతులు లేని లేఅవుట్లకు తప్పుడు రిజిస్ట్రేషన్లు చేస్తూ పెద్ద ఎత్తున సొమ్ము వసూలు చేస్తున్నట్లు రహస్య విచారణలో గుర్తించినట్లు సమాచారం. నిబంధనలకు విరుద్ధంగా 1/70 రిజిస్ట్రేషన్లు, తప్పుడు ధృవపత్రాలతో రిజిస్ట్రేషన్లపై లోతుగా విచారణ చేస్తున్నా అధికారులు, రెవెన్యూ కార్యాలయాల్లో జరిగే రిజిస్ట్రేషన్లు కొంతమంది అధికారులకు కాసుల వర్షంలా మారింది. క్రిటికల్ రిజిస్ట్రేషన్లకు సంబంధించి ముందే అధికారులతో మాట్లాడుకొని తర్వాత స్లాట్ బుక్ చేసుకొని రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు.

# ఏకరూప వస్త్రాలు సకాలంలో అందించాలి



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు బడులు ప్రారంభం రోజున ఏకరూప వస్త్రాలు అందించాలని నేలకొండపల్లి ఎంపీడీఓ యం.యర్రయ్య తెలిపారు. మండలం లోని మంగ్రాజుపల్లి, బోదులబండ గ్రామాలలో ఏకరూప వస్త్రాల కుట్టు పనులను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు...టైలర్లు అనుకున్న సమయం లోపు అందించాలని సూచించారు. మండలంలో 3,208 మంది విద్యార్థులకు దుస్తులు అందించేందుకు కృషి జరుగుతుందని అన్నారు. ఇందు కోసం మండలం లో మొత్తం 35 మంది టైలర్లు ను ఏర్పాటు చేసినట్లు పేర్కోన్నారు. ఈ నెల 5 వ తేది లోపు వస్త్రాలు అందించాలని కోరారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజనం, కనీస సౌకర్యాలు అందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి శివ, ఐకేపీ ఏపీవో ఆశోక్రాణి తదితరులు పాల్గొన్నారు.

# సెన్స్ సెక్షన్లను సద్వినియోగం చేసుకోవాలి

**ప్రజాపక్షం/ మధిర :** మధిర, ఎర్రుపాలెం, బోనకల్ మండల పరిసర ప్రాంత విద్యార్థులు సైన్స్ సెక్షన్లను సద్వినియోగం చేసుకోవాలని మధిర ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎఎన్ఎల్ శాస్త్రి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. అనేక సంవత్సరాలుగా మధిర ప్రభుత్వ డిగ్రీ కశాశాలలో సైన్స్ సెక్షన్లు లేకపోవడం వల్ల ఈ ప్రాంత విద్యార్థులు సైన్స్ విద్య పొందేందుకు సుదూర ప్రాంతాలకు వెళ్తున్నారని ఆయన తెలిపారు. 202425 విద్యా సంవత్సరానికి మధిర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బిఎస్సీలైఫ్ సైన్స్, బిఎస్సీ ఫిజికల్ సైన్స్‌అనే రెండు కొత్త కోర్సులు మంజూరైనట్లు ఆయన తెలిపారు. వీటితో పాటు బిఏ, బికాం, బిఎస్సీ కంప్యూటర్ కోర్సులు, జనరల్ కోర్సులు పూర్తిగా విద్యార్థులకు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ ప్రాంత విద్యార్థులు దోస్త్ అడ్మిషన్ తీసుకుని మధిర డిగ్రీ కళాశాలకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన కోరారు. అడ్మిషన్ల సమాచారం కోసం దోస్త్ కో ఆర్డినేటర్ జి.అరుణ 9441786508నెంబర్‌కు సంప్రదించాలని తెలిపారు.

# కుట్టు కేంద్రం తనిఖీ



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరులోని స్త్రీ శక్తి భవనంలో విద్యార్థులకు ఏకరూప దుస్తులను తయారు చేస్తున్న కుట్టు కేంద్రాన్ని ఖమ్మం జిల్లా అధికారి సీఎంఓ రాజశేఖర్ సందర్శించి, పాఠశాలలు ప్రారంభ రోజు నాటికి యూనిఫామ్ విద్యార్థులకు అందించేందుకు పూర్తి చేయాలని ఏపిఎంకు ఆదేశించారు. మహిళా శక్తి కుట్టు కేంద్రాలు చెన్నూరు, నారాయణపురం, పాయపూర్‌లలో దుస్తులు తయారీని పరిశీలించారు. అదే విధంగా గ్రామాలలో బడి బయట ఉన్న పిల్లలను బడిలో చేర్పించేందుకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీసీలు దర్జీలు పాల్గొన్నారు.

# డీసీఎం వ్యాన్ బోల్తా..ఒకరి మృతి



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** మండలం లోని గువ్వలగూడెం లో శుక్రవారం డీసీఎం వ్యాన్ పల్టీ కొట్టింది. ప్రమాదంలో ఒకరు మృతి చెందింది. బాధితుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఏపీ లోని రాజమండ్రి నుంచి సూర్యాపేట జిల్లాలోని మిర్యాలగూడెం కు పనస కాయలతో వెళ్తున్న డీసీఎం వ్యాన్ నేలకొండపల్లి మండలం లోని గువ్వలగూడెం వద్దకు రాగానే పల్టీ కొట్టింది. అందులో ప్రయాణిస్తున్న దొడ్డా నాగరాజు (38) వై.ప్రభాకర్ కు తీవ్ర గాయాలైయ్యాయి. 108 ద్వారా ఖమ్మం తరలించారు. వారిలో నాగరాజు పరిస్థితి విషమించటంతో హైద్రాబాద్ తరలిస్తున్నారు. కాగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతదేహం ను నేలకొండపల్లి ప్రభుత్వ హాస్పిటల్ లో పోస్టుమార్టమ్ నిర్వహించారు.

# కొనసాగుతున్న చెరువు ఆక్రమణలు తొలగింపు



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** మండలం లోని చెరువుమాధారం చెరువులో జరిగిన ఆక్రమణ లపై ఇరిగేషన్ అధికారులు అగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం జెసీబీ తో పనులను ప్రారంభించారు. అక్రమణలను తొలిగించే పనులు యుద్ధ ప్రాతిపధిక ను చేపట్టారు. ఆక్రమణదారులు చెరువు ఆక్రమించి చెరువు కట్ట పోశారు. దీంతో కట్టలను చెడగొట్టి యంత్రాల ద్వారా మట్టి ని బయటకు తీశారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ డీఈఈ మన్మధరావు, ఏఈ నరేష్ లు మాట్లాడారు....చెరువు ను ఆక్రమిస్తే ఎంతటి వారైనా సరే సహించేది లేదని హెచ్చరించారు. ఆక్రమించిన స్థలం ను స్వాధీనం చేసుకుంటామని అన్నారు. హద్దులు దాటితో కేసులు నమోదు చేయిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రెండవ ఏఎన్ఎంల పట్ల వివక్ష

**-రెగ్యులర్ చేసే వరకు పోరాటం**
**-ఏఐటియుసి నేత నర్సింహ**





**ప్రజాపక్షం/ ఖమ్మం :** తెలంగాణ రాష్ట్రంలో ఎన్‌హెచ్ఎం లో పని చేస్తున్న రెండవ ఏఎన్ఎంల పట్ల ప్రభుత్వం వివక్ష ప్రదర్శిస్తుందని ఏఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం. నర్సింహా తెలిపారు. రెండవ ఏఎన్ఎంలను రెగ్యులర్ చేసే వరకు ఏఐటియుసి ఆధ్వర్యంలో పోరాటం జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. శుక్రవారం గిరిప్రసాద్ భవన్‌లో రెండవ ఏఎన్ఎంల జిల్లా స్థాయి అవగాహన సదస్సు జరిగింది. సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన నర్సింహా మాట్లాడుతూ భారతదేశంలో 157000 మంది రెండవ ఏఎన్ఎంలు ఉన్నారని తెలంగాణ రాష్ట్రంలో ఆరువేల మంది ఏఎన్ఎంలు పనిచేస్తున్నారని రెండవ ఏఎన్ఎంలకే పని భారం ఎక్కువగా ఉందన్నారు. రోజుకు 10 నుంచి 12 గంటల పాటు పని చేస్తున్నారని తెలంగాణ రాష్ట్రంలో విడుదల చేసిన జీవో నెం. 16లో రెండవ ఏఎన్ఎంలను చేర్చి రెగ్యులర్ చేయాలన్నారు. సమ్మె కాలంలో గత ప్రభుత్వం ఇచ్చిన 100 శాతం గ్రాస్ శాలరీని వెంటనే అమలు చేయాలని, త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేసి పని భారం తగ్గించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని నర్సింహా డిమాండ్ చేశారు. గ్రామ పంచాయితీ పరిధిలో ఏఎన్ఎంల సేవలను ప్రభుత్వం గుర్తించకపోవడం శోచనీయమన్నారు. ఉద్యోగాల్లో చేరి 25 ఏళ్ల పాటు సేవలు అందించి వట్టి చేతులతో ఇంటికి వెళ్లడం బాధాకరమన్నారు. వెంటనే ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఏఐటియుసి రాష్ట్ర నాయకులు శింగు నర్సింహారావు, రెండవ ఏఎన్ఎం సంఘ రాష్ట్ర గౌరవాధ్యక్షులు తోట రామాంజనేయులు, సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు ధనలక్ష్మి, సహాయ కార్యదర్శి హేమలత, నాయకులు సునీత, నాగమణి, కృష్ణవేణి, రాజేశ్వరి, విజయలక్ష్మి, శైలజ, ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.

# కౌంటింగ్‌కు పటిష్ట ఏర్పాట్లు చేయండి

**జిల్లా కలెక్టర్ విపి గౌతమ్**






**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** లోక్‌సభ సాధారణ ఎన్నికల కౌంటింగ్‌కు పటిష్ట ఏర్పాట్లు చేయాలని ఖమ్మం పార్లమెంటు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ విపి గౌతమ్ తెలిపారు. శుక్రవారం కలెక్టర్ విపి గౌతమ్ పోలీస్ కమిషనర్ సునీల్ దత్‌తో కలిసి కౌంటింగ్ కేంద్రం వద్ద బందోబస్తు పై చేపట్టాల్సిన చర్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బంది ఏజెంట్ల ప్రవేశ మార్గం పై పలు సూచనలు చేశారు. కౌంటింగ్ కేంద్ర ఆవరణలో, లోపల చేపట్టాల్సిన బ్యారికేడింగ్ పై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. పార్కింగ్, మెడికల్ శిబిరం, మీడియా పాయింట్ కు సంబంధించి అధికారులకు సూచనలు ఇచ్చారు. ఎప్పటికప్పుడు ఫలితాల ప్రకటనకు తీసుకోవాల్సిన చర్యల గురించి అధికారులకు పలు ఆదేశాలు ఇచ్చారు. కౌంటింగ్ కేంద్రంలోని కౌంటింగ్ సిబ్బంది, ఏజెంట్ల ప్రవేశం, స్ట్రాంగ్ రూము నుండి కౌంటింగ్ హాల్‌కి , కౌంటింగ్ పూర్తయిన పిదప ఈవిఎంలను జిల్లా స్ట్రాంగ్ రూముకు చేరవేత తదితర వాటిపై అధికారులకు పలు సూచనలు చేశారు. అసెంబ్లీ ఎన్నికల అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్, అదనపు డిసిపి ప్రసాదరావు, ఆర్అండ్‌బి ఎస్ఈ శ్యాంప్రసాద్, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ శ్రీలత, అధికారులు పాల్గొన్నారు.

# భవిష్యత్తుకు అనుగుణంగా నిర్మాణాలు చేపట్టాలి

**వైద్య కళాశాల నిర్మాణంపై కలెక్టర్ సమీక్ష**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా అన్ని సదుపాయాలతో ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణం చేపట్టాలని జిల్లా కలెక్టర్ విపి గౌతమ్ తెలిపారు. శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో వైద్య విద్య సంచాలకులు డాక్టర్ ఎన్. వాణితో కలిసి ప్రభుత్వ వైద్య కళాశాల భవన నిర్మాణంపై కలెక్టర్ విపి గౌతమ్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ వైద్య కళాశాల శాశ్వత భవనాలకు ఖమ్మం అర్బన్ మండలం బల్లేపల్లి, రఘునాథపాలెం గ్రామాల్లో 43 ఎకరాల స్థలం గుర్తించామన్నారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ఆదర్శ కళాశాలగా తీర్చిదిద్దాలని ఆయన తెలిపారు. నిర్మాణ ప్లానులో కళాశాల భవనాలు, విద్యార్థుల హాస్టల్ భవనాలు, అధ్యాపకుల క్వార్టర్స్ నిర్మాణం, హైవేకు కళాశాల ప్రధాన భవనం ఫేసింగ్ ఉండి విజబుల్‌గా ఉండేటట్లు ప్లాన్ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. స్థల సమస్య లేదన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు వైద్య విద్య సంచాలకులు డాక్టర్ విమల థామస్, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరరావు, ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్. కిరణ్‌కుమార్, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ బి. కిరణ్‌కుమార్, ఆర్అండ్‌బి ఎస్ఈ శ్యాంప్రసాద్, కలెక్టరేట్ సూపరింటెండెంట్ మదన్ గోపాల్, ఖమ్మం అర్బన్ మండల తహసీల్దార్ సిహెచ్ స్వామి, అధికారులు పాల్గొన్నారు.

## తెలంగాణ పోరులో సిపిఐదే కీలక భూమిక

**-సిపిఐ రాష్ట్ర నాయకులు అయోధ్య**




**ప్రజాపక్షం/ ఖమ్మం :** తెలంగాణ పోరులో సిపిఐ కీలక భూమిక పోషించిందని సిపిఐ రాష్ట్ర నాయకులు బి.అయోధ్య తెలిపారు. శుక్రవారం మణుగూరులో జరిగిన సమావేశంలో బొల్లోజు అయోధ్య మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో పాల్గొని అమరులైనటువంటి కుటుంబాలను కాని ఉద్యమకారులను కాని ప్రభుత్వాలు పూర్తిగా విస్మరించాయన్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యారు కాని ప్రజలు ఏదైతే ఆశించారో ఆ ఫలాలు అందించకుండా కేసిఆర్ నియంతృత్వ ధోరణి అవలంభించి ప్రజలకు వ్యతిరేకంగా పని చేశా రన్నారు. ప్రజా సమస్యలపై ప్రజా పోరాటాలు నిర్మిస్తూ ప్రజల పక్షాన వారి హక్కుల కోసం నిరంతరం పోరాటం సాగిస్తామన్నారు. ప్రజలను వంచించి మోసానికి పాల్పడితే ఏ పార్టీ అయినా వదిలేది లేదన్నారు. గెలిచినా, ఓడినా ప్రజల పక్షాన పేద ప్రజల కోసం పని చేస్తామన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. విద్యా, వైద్యం, ఉపాధి అవకాశాలు మెరుగుపర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సరెడ్డి పుల్లారెడ్డి, మున్నా లక్ష్మి కుమారి, మణుగూరు మండల కార్యదర్శి జంగం మోహన్‌రావు, పట్టణ కార్యదర్శి సుధాకర్, జిల్లా సమితి సభ్యులు ఆర్. లక్ష్మి నారాయణ, ఎస్‌కె సర్వర్, సొందే కుటుంబరావు, మాజీ ఎంపిపి ఎడారి రమేష్, ఆదర్ల రాములు, రాయల బిక్షం, జి. వెంకటేశ్వర్లు, కొత్తపల్లి సీతారాములు, ఎంపిటిసి లక్ష్మయ్య, సత్యనారాయణ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి

**-జూన్ రెండవ వారంలో ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు**
**-పిఆర్‌టియు నాయకులు ఎంఎల్‌సి రఘోత్తమ రెడ్డి**



**ప్రజాపక్షం/ ఖమ్మం :** ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని బడి బాట కార్యక్రమాన్ని విజయవంతం చేసి తద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలని పిఆర్‌టియు నాయకులు, ఎంఎల్‌సి కూర రఘోత్తమరెడ్డి ఉపాధ్యాయులకు విజ్ఞప్తి చేశారు. పిఆర్‌టియు ఖమ్మంజిల్లా శాఖ ఆధ్వర్యంలో క్రియాశీల కార్యకర్తలకు ఒక రోజు శిక్షణా కార్యక్రమాన్ని స్థానిక న్యూవిజన్ జూనియర్ కళాశాల మీటింగ్ హాల్‌లో నిర్వహించారు. ఉపాధ్యాయ సమస్యలు, నియమ నిబంధనలు తదితర వాటిపై శిక్షణా తరగతులు నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు యలమద్ది వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రఘోత్తమ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచితే ప్రభుత్వ విద్య బలోపేతం అవుతుందన్నారు. జూన్ రెండవ వారంలో ఉపాధ్యాయ పదోన్నతులు బదిలీల షెడ్యూల్ విడుదల అవుతుందని ఆయన తెలిపారు. పండిట్ పిఈటి అప్‌గ్రేడేషన్ కూడా పూర్తి అవుతుందని టెట్ లేకుండానే పదోన్నతులు కల్పించేవిధంగా సంఘం కృషి చేసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు శ్రీపాల్‌రెడ్డి, సీనియర్ నాయకులు వెంకటనర్సయ్య, మోత్కూరి మధు, విజయ్ అమృత్‌కుమార్, పాపారావు తదితరులు మాట్లాడగా జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్. రంగారావు, న్యూవిజన్ విద్యా సంస్థల అధినేత సిహెచ్‌జికె ప్రసాద్, నాయకులు బ్రహ్మారెడ్డి, శేఖర్, సుజాత, వివిధ మండలాల నుంచి ప్రతినిధులు హాజరయ్యారు.

## సంబరాలతోపాటు సమస్యలపై పోరాడేందుకు సిద్ధం కావాలి



**ప్రజాపక్షం/కారేపల్లి:** దశాబ్దాల పోరాటం వందలాది మంది త్యాగాలతో ఆవిర్భవించిన తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అమరవీరులకు నివాళి కార్యక్రమంలో పాల్గొంటూనే ప్రజల దైనందిన సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వాలపై సమరానికి తెలంగాణ ప్రజలు సిద్ధం కవాలని సిపిఐ ఎంఎల్ మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి గోకినపల్లి వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. స్థానిక కారేపల్లి మండల కేంద్రంలో జరిగిన కారేపల్లి, కామేపల్లి సంయుక్త మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగిస్తూ దశాబ్దం కాలం పాటు తెలంగాణను పరిపాలించిన కెసిఆర్ తెలంగాణ ప్రజల మౌళిక సమస్యల పరిష్కారం చూపడంలో విఫలం చెందారని అందువలనే గడిచిన ఎన్నికల్లో కెసిఆర్‌ను ప్రజలు బుద్ధి చెప్పారని, అలాగే అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మాటలతో కాలం గడపకుండా ఇచ్చిన ఆరు హామీలను అమలుకు పూనుకోవాలని ఆయన అన్నారు. ఖమ్మం జిల్లాకు సీతారామ ప్రాజెక్ట్ ద్వారా సాగునీరు, త్రాగునీరు అందించేందుకు కృషి చేయాలని బయ్యారం ఉక్కు పరిశ్రమ నెలకొల్పి యువకులకు ఉద్యోగ ఉపాధి అవకాశం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆవుల అశోక్, డివిజన్ కార్యదర్శి టి.ఝాన్సి, మండల కార్యదర్శులు గుమ్మడి సందీప్, ఎన్‌వి.రాకేష్, డివిజన్ నాయకులు గుగులోతు తేజనాయక్, మండల నాయకులు భాస్కర్, సత్తిరెడ్డి, సక్రు, బాలు, అనసూర్య, సరోజిని, రంగ్య రాజు పాల్గొన్నారు.